జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఆదిలాబాద్
## మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
ఆదివారం 20 సెప్టెంబర్ 2026 పేజీలు : 8

## అడ్డా కార్మికులకు ప్రత్యేక స్థలం కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలి



# ఒక్క సంతకం కోసం మూడు నెలల నిరీక్షణ!




- పంచాయతీ కార్యాలయం చుట్టూ కాంట్రాక్టర్ ప్రదక్షిణలు
- పనులు పూర్తయినా ప్రక్రియకు బ్రేక్ రాజకీయ విభేదాల ప్రభావమేనా..?
- అభివృద్ధి పనులకు పరిపాలనా జాప్యం అడ్డంకిగా మారిందా..?
- అధికారుల జోక్యం కోసం ఎదురుచూపులు

వాంకిడి: గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాటికి సంబంధించిన పరిపాలనా ప్రక్రియ ముందుకు సాగాల్సి ఉండగా, ఒక సంతకం వద్దే వ్యవహారం నిలిచిపోయిందని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ సంతకం కోసం గత మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఒక చిన్న ప్రక్రియ కోసం ఇంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి తనకు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తోందని పేర్కొన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీ స్థాయిలో పూర్తి చేయాల్సిన ప్రక్రియలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకాలు పూర్తయ్యాయి

## విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలి




బాల్యం నుంచే విద్యార్థులు మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సత్ప్రవర్తనను అలవ ర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆరోగ్య కరమైన జీవనశైలి, నై తిక విలువలు, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాట లు పడతాయని అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో

## త్వరలోనే ఆదిలాబాద్ ఐటీ టవర్ ప్రారంభం

- జిల్లా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు
- 2,000 మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు
- ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 3 ప్రముఖ ఐటీ కంపెనీలు



# టీఎన్జీవో హౌసింగ్ కాలనీలో 5వ రోజు మహా అన్నదానం





**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా నస్పూర్ టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ కాలనీలోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమతి, శ్రీ ముసుకుల రజిత--కుమారస్వామి దంపతులు, శ్రీమతి, శ్రీ జోగుల శ్రీదేవి--ప్రభాకర్ దంపతులు మహా అన్నదానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం శ్రీహరి మాట్లాడుతూ, ఐదో రోజు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించిన పుణ్య దంపతులకు శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. టీఎన్జీవో హౌసింగ్ కాలనీలోని శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి వద్ద గణేష్ నవరాత్రులను పురస్కరించు కుని దాతల సహకారంతో ప్రతిరోజూ మధ్యాహ్నం మహా అన్నదానం సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలు, కాలనీ వాసులు, మహిళలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించిన ముసుకుల రజిత--కుమారస్వామి దంపతులు, జోగుల శ్రీదేవి--ప్రభాకర్ దంపతులను టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ ఉత్సవ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షులు గుండేటి యోగేశ్వర్, కార్యదర్శి కస్తూరి నాగేశ్వర్, టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షులు సైండ్ల మొండయ్య, నాయకులు పుప్పాల హనుమంతరావు, పొన్న మల్లయ్య, శ్రీపతి బాపురావు, బొడ్డు శ్రావణ్ కుమార్, భూముల రామ్మోహన్, తిరుపతి రెడ్డి, సునీత, ఎన్. సత్యనారాయణ, టి. తిరు పతి, రాంకుమార్, ప్రసాద్, ఉషన్న తదితరులతో పాటు టీఎన్జీవో హౌసింగ్ కాలనీ నాయకులు, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా

ప్రకృతి పదార్థాల వినియోగంపై అవగాహన

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**వినాయక నవరాత్రులు కొనసాగుతున్న నేపథ్యంలో నిత్యం నిర్వహించే పూజా కార్యక్రమాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, ప్రకృతి సిద్ధమైన పదార్థాలను ఉపయోగించాలనే సందేశంతో ప్రకృతిమిత్ర ఆధ్వర్యం లో నస్పూర్‌లో ప్రతిరోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా రు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక మండపాల వద్ద భక్తులకు అవగాహన కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం నస్పూర్ కలెక్టరేట్ రోడ్డులోని టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండపం వద్ద ప్రకృతిమిత్ర సభ్యులు వివిధ రకాల పర్యావరణహిత వస్తువులను ప్రదర్శించారు. ఆకు దొప్పలు, అరికే ఆకు పళ్లాలు, బట్ట సంచులు, జనపనార సంచులు, కాగితం సంచులు, స్టీల్ పళ్లాలు, గ్లాసులు, విస్తరాకులను ప్రదర్శించి వాటి వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా "పవిత్ర వినాయక మండపాల వద్ద ప్లాస్టిక్ వద్దు.. ప్రకృతి పదార్థాలే ముద్దు.. నిత్య పూజల్లో థర్మోకోల్ పళ్లాలు వద్దు.. ఆకు దొప్పలే ముద్దు.. వెదురు బుట్టలు, మట్టి పాత్రలు వినియో గిద్దాం.. సంపూర్ణ భక్తిని పొందుదాం" అంటూ పెద్ద ఎత్తున నినాదా లు చేశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీ శ్రీ సిద్ధి వినాయక గణేష్ మండలి అధ్యక్షుడు గడియా




రం శ్రీహరి మాట్లాడుతూ, గత సంవత్సరం నుంచి ఇక్కడ నిర్వహి స్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ లు పెద్దఎత్తున భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను పర్యావరణహిత జీవన విధానం వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతిమిత్ర సభ్యులు, వినాయక మండలి సభ్యులు కస్తూరి నాగేశ్వర్, పొన్న మల్లయ్య, శ్రీపతి బాబురావు, టి. సంపత్ కుమార్, కె. రాజమౌళి, జి. వెంకటేశం, నాన్నయ్య, స్వర్ణలత, సునీత, నీరజ, కమల, పద్మాంజలి, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వేసుకుని వ్యక్తి మృతి.

**లక్సెట్టిపేట సెప్టెంబర్ 19(ప్రజాజ్యోతి)** పట్టణంలోని భగత్ సింగ్ నగర్ కు చెందిన గుర్రాల జయకర్ (40) అనే వ్యక్తి తన ఇంటి సమీపంలోని వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గోపతి సురేష్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం, మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అందరికీ పెళ్లిలయ్యాయి. మృతునికి కుటుంబ కలహాలతో ఇటీవల గొడవలు జరగగా మృతుడు తన సోదరులకు ఫోన్ చేసి నాకు ఇంట్లో కుటుంబ కలహాలతో ఎప్పుడు గొడవ జరుగుతుందని, నాకు బ్రతకడం ఇష్టం లేదని ఫోన్ చేసి చెప్పి ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నా



రు. మృతుడి సోదరుడు గుర్రాల చంద్రమౌళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ప్రమాద బీమా చెక్కు అందజేసిన ప్రేమ్ ఎమ్మెల్యే సాగర్ రావు



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**గాయత్రి కో-ఆపరేటి వ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ ఖాతాదారుడు సిరిపురం మల్లేష్ ప్రమాదవశాత్తు మృతి చెందగా, ఆయన గాయత్రి నిర్భయ సేవింగ్స్ ఖాతాపై ఉన్న ప్రమాద బీమా సౌకర్యం ద్వారా మంజూరైన రూ.1 లక్షల ప్రమాద బీమా చెక్కును మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శనివారం అందజేశారు. మృతుడు సిరిపురం మల్లేష్ భార్య మల్లెల స్రవంతికి మంజూరైన రూ.1,00,000 విలువైన ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు ఆమె కుమారుడికి అందజేశారు. గాయత్రి బ్యాంకు అందిస్తున్న ప్రమాద బీమా సౌకర్యం ఖాతాదారుల కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసాగా నిలుస్తుందని ఈ సందర్భం గా అ న్నారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మంచిర్యాల శాఖ బ్రాంచి మేనేజర్ కేలేటి ప్రవీణ్, జూని యర్ ఆఫీసర్లు ఇ. శివకుమార్, డి. రాజశేఖర్, ఆర్. రమేష్, మం చిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్పొ రేటర్ తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, కో-ఆప్షన్ సభ్యులు మీనాన్ బాయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మధ్యకు వెళ్లి సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**ప్రజల మధ్యకు వెళ్లి క్షేత్రస్థాయిలో వారి సమస్యలను తెలుసుకుని, వాటికి పరిష్కారం చూపడమే తన లక్ష్యమని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని 24, 25వ డివిజన్లు సింగపూర్, తాళ్లపల్లి ఆర్‌ఆర్ కాలనీలో సింగరేణి జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలోని ప్రజలను ఎమ్మెల్యే నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు వివరించిన సమస్యలపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, స్థానిక సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచిం చారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవడం ద్వారా వాటి పరిష్కారానికి మరింత వేగంగా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిష నర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్, మున్సిపల్ అధికారులు, స్థానిక కార్పొరేటర్లు బొడ్డు పద్మ తిరుపతి, తోట రజిత--శ్రీనివాస్, ఇతర కార్పొరేటర్లు, నాయకు లు, మహిళా నాయకురాళ్లు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత







మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. హన్నన్

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. హన్నన్ తెలిపారు .మంచిర్యాల పట్టణంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై మంచిర్యాల ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమంను శనివారం నిర్వహించారు. మంచిర్యాల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.డి. హన్నన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ఎం.డి. హన్నన్ మాట్లాడుతూ, వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించేటప్పుడు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపడం వంటి నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో మొబైల్‌ఫోన్ వినియోగించడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున వాహనం నడిపేటప్పుడు మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వివరించారు. ముఖ్యంగా యువత వాహనాలు నడిపేటప్పుడు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, తమ డ్రైవింగ్ ఇతరుల ప్రాణాలపై కూడా ప్రభావం చూపుతుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు తాము నిబంధనలు పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సీఐ హన్నన్ కోరారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, రోడ్డు భద్రతకు తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# అనార్‌పల్లి వాగులో బాహుబలి సీన్..!



**చంటి బిడ్డను తలపై పెట్టుకుని ప్రవహిస్తున్న వాగు దాటిన తండ్రి**

**ప్రతి వర్షాకాలంలో ఇదే తిప్పలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం!**

**వాగు దాటాలంటే ప్రాణాలను పణంగా పెట్టాల్సిందేనా?**

**ప్రసంగాలు కాదు.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తుల డిమాండ్**

**ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. అనార్‌పల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తే గ్రామస్తులు బయటకు వెళ్లాలన్నా.. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించాలన్నా సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొంటోంది. తాజాగా చంటి బిడ్డను రెండు చేతులతో తలపై ఎత్తుకుని ఓ తండ్రి ప్రవహిస్తున్న వాగును దాటిన దృశ్యం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ దృశ్యం చూస్తే సినిమాల్లోని 'బాహుబలి' సన్నివేశాన్ని తలపించేలా ఉందంటూ స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. వర్షం కురిసిందంటే చాలు.. అనార్‌పల్లి వాగు ఉప్పొంగుతుంది. ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడిన ప్రతిసారీ గ్రామస్తులకు ఇదే అవస్థలు ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగుపై సరైన వంతెన లేకపోవడంతో అత్యవసర పనుల కోసం బయటకు వెళ్లే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వాగు దాటాల్సి వస్తోందని ఆరోపిస్తున్నారు.

**ఏటా ఇదే పరిస్థితి.. అయినా పట్టింపు లేదు**

అనార్‌పల్లి వాగు సమస్య కొత్తది కాదని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రతి వర్షాకాలంలో వాగు పొంగిపొర్లడం, రాకపోకలు నిలిచిపోవడం పరిపాటిగా మారిందని అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు వాగు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు.వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ఏమాత్రం అదుపుతప్పినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని తెలిసినా.. ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సమస్యను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

**ప్రసంగాలు కాదు.. చేతల్లో చూపాలి**

ఎన్నికల సమయంలో గ్రామాల్లో పర్యటిస్తూ అభివృద్ధి హామీలు ఇచ్చే ప్రజాప్రతినిధులు.. ఇలాంటి మౌలిక సమస్యల పరిష్కారంలో కూడా అదే చొరవ చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వాగుపై శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టి తమ రాకపోకలకు భద్రత కల్పించాలని కోరుతున్నారు. చంటి బిడ్డను తలపై పెట్టుకుని వాగు దాటాల్సిన పరిస్థితి రావడం అభివృద్ధి మాటలకు అద్దం పడుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అనార్‌పల్లి వాగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఫ్లెక్సీల తొలగింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఎలాంటి సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తొలగించడంపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలకు చెందిన ఆ వర్గం కాంగ్రెస్ నాయకులు శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ నిన్న మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పర్యటించిన సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. అయితే ఆ ఫ్లెక్సీలను మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే తొలగించారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దళిత ఎంపీగా ఉన్న గడ్డం వంశీకృష్ణ పర్యటనకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఇలా తొలగించడం పట్ల కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీల తొలగింపు వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, బాధ్యులైన మున్సిపల్ కమిషనర్, సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజాప్రతినిధుల పర్యటనల సందర్భంగా ఏర్పాటు చేసే ఫ్లెక్సీల విషయంలో నిబంధనలు అందరికీ సమానంగా వర్తించేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మంచిర్యాలలో

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జన వేడుకలు



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వినాయక నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరితంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. సునీత మార్గదర్శకత్వంలో, వైస్ ప్రిన్సిపాల్ వహీదా పర్యవేక్షణలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్--1, 2 ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించిన అనంతరం విద్యార్థినులు, అధ్యాపకులు నిమజ్జన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, ఐక్యతతో భక్తి కార్యక్రమాల్లో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణహిత వినాయక నిమజ్జనం ఆవశ్యకతను వివరించారు. నిమజ్జనం సందర్భంగా నీటి వనరులు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, పరిశుభ్రతను పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కార్యక్రమం ముగిసిన అనంతరం విద్యార్థినులు, కళాశాల సిబ్బందికి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్--1, 2 ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత....

**బెజ్జూర్ 19 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** పోలీసులు ముంజంపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగ నాలుగు ప్లాస్టిక్ సంచుల్లో రేషన్ బియ్యం రెండు ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా అనుమానంతో ఆపి తనిఖీ చేశారు. సుమారు 2 క్వింటాల్ పీడీఎస్ బియ్యం గుర్తించారు. వాహనదారులు ముంజంకర్ ప్రేమ్ సాగర్ (35), ధోరేపల్లి గ్రామం, సిర్పూర్-టి మండలంగా నన్న శ్రీనివాస్ నివాసం: ముత్యంపేట గ్రామము కౌటాల మండలం అని వెల్లడించాడు. విచారణలో, ముంజంపల్లి మరియు పరిసర గ్రామాల పీడీఎస్ లబ్ధిదారుల వద్ద నుండి బియ్యాన్ని కొనుగోలు చేసి, మహారాష్ట్రలోని ఆలపల్లి ప్రాంతంలో విక్రయిస్తూ అక్రమ లాభాలు పొందుతున్నట్లు అంగీకరించాడు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా అధిక ధరలకు విక్రయించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై పోలీసులు కఠినమైన చట్ట పరమైన చర్యలు తీసుకుంటారు.పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మరియు విక్రయాలకు సహకరించే వ్యక్తులు, అలాగే లబ్ధిదారుల నుండి బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యాపారులు కూడా చట్టపర మైన చర్యలకు గురవుతారు. ప్రజలు ఇటువంటి అక్రమ కార్యకలా పాలకు పాల్పడకుండా, ఎవరికైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు లేదా తరలిస్తున్నట్లు తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచిం చారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై ఇకపై కూడా నిరంతరం నిఘా ఉంచి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## సర్పంచులు గ్రామాభివృద్ధికి బాటలు వేయాలి

**ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగాలి: ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్**

**ప్రజలకు అందుబాటులో ఉండాలి: ఆత్రం సుగుణక్క**



**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19** ప్రజా జ్యోతి గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలకపాత్ర పోషిస్తూ ప్రజల భాగస్వామ్యంతో ముందు కు సాగాలని ఏఐసీసీ సెక్రెటరీ సచిన్ సావంత్ సూచించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రోజ్ ఫంక్షన్ హాల్‌లో శనివారం రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో ఆసిఫా బాద్ నియోజకవర్గ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా హాజరైన సచిన్ సావంత్ మాట్లాడుతూ గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల భాగస్వామ్యా న్ని పెంచాలన్నారు.రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ తెలంగాణ ఇన్‌చార్జి, నేషనల్ సెక్రెటరీ బి. సుభాష్ యక్కర మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ లక్ష్యాలు, స్థానిక పాలన ప్రాధాన్యత, సర్పంచుల బాధ్యతల పై అవగాహన కలిగి ఉండాల న్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క మాట్లాడు తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు చేరేలా చొరవ చూపాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యామనాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మోరే సంతోష్, ఇతర నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# “విధులకు డుమ్మా కొడితే చర్యలే!”

## జిల్లా కలెక్టర్ కె.హరిత హెచ్చరిక



**ఆసిఫాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి)**ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ల వివరాలను గుర్తించిన ఆమె.. వారిపై చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులకు చరవాణి ద్వారా ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించాలని కలెక్టర్ సూచించారు. విధులకు తరచూ గైర్హాజరవుతూ బాధ్యతలను విస్మరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదని తేల్చిచెప్పారు. కాగా,వాంకిడి ఇన్చార్జీ పశువైద్యకారి విధులకు నిర్లక్ష్యం, చిర్రకుంటతో పాటు జిల్లాలో పలు పశువైద్యశాలలకు డాక్టర్ల కొరత, సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. ఈ తనిఖీలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ వెంకన్న, ప్రొఫెసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

## నూతన అధికారులకు శ్రీరాంపూర్ ఏరియా బీసీ అసోసియేషన్ ఘన సన్మానం



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**బాధ్యతలు స్వీకరించిన అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరారు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి కాలరీస్ బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్-- శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏరియా క్వాలిటీ మేనేజర్ శ్రీధర్ రావు, ఏరియా ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ మురళీకృష్ణ యాదవ్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ తోట సత్యనారాయణలను ఘనంగా సన్మానించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ , ఉద్యోగ జీవితంలో మరిన్ని పదోన్నతులు సాధించి అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా బీసీ ఉద్యోగుల ఐక్యత, చైతన్యం, సంక్షేమం కోసం సహకరిస్తూ బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కృష్ణ ప్రసాద్, బీసీ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్, బ్రాంచ్ కార్యదర్శులు మారుతి, బద్రి బుచ్చయ్య పాల్గొని ప్రసంగించారు. అలాగే బీసీ నాయకులు కొత్తపల్లి రవీందర్, జగదీశ్, సహాయ కార్యదర్శి చంద్రమోహన్, ట్రెజరర్ మల్లేష్, పిట్ సెక్రటరీలు కారుకురి మనోజ్, వినోద్, రాజ్‌కుమార్, తిరుపతి తదితర బీసీ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సేవా భారతి 5కే/10కే రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

## సేవా భారతి సభ్యులు రఘునాథ్ వెరబెల్లి



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** “ఫిట్ ఇండియా -- ఫిట్ మంచిర్యాల” నినాదంతో సేవా భారతి ఆధ్వర్యంలో ఈ నెల 20న మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి నిర్వహించనున్న 5కే/10కే రన్‌లో ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సేవా భారతి సభ్యులు రఘునాథ్ వెరబెల్లి కోరారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణంలోని ఏకలవ్య ఆశ్రమంలో 5కే/10కే రన్‌కు సంబంధించిన పోస్టర్‌ను సేవా భారతి సభ్యులు రఘునాథ్ వెరబెల్లి, ఏకలవ్య ఆశ్రమ అధ్యక్షులు వోద్నల లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి మాట్లాడుతూ “ఫిట్ మంచిర్యాల” నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో యువతీ యువకులు, ప్రముఖులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడంతో పాటు పట్టణ ప్రజల్లో ఫిట్‌నెస్‌పై ఆసక్తిని పెంపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. రన్‌లో పాల్గొనదలచిన వారు 9160603222 నంబర్‌కు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాజుల ముఖేష్ గౌడ్, కస్తూరి నాగరాజు, పట్టి వెంకట కృష్ణ, బియ్యాల సతీష్ రావు, అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, బోట్ల సత్యం, జయరామ రావు, పల్లి రాకేష్, ఆడే ప్రేమ్ సింగ్, నాంపల్లి శ్రీనివాస్, శివ కృష్ణ, బింగి ప్రవీణ్, గాజుల ప్రభాకర్, బోయిని దేవేందర్, మెరిడికొండ శ్రీనివాస్, చిరంజీవి, అన్నం శివ తదితరులు పాల్గొన్నారు.

# ఒక చుక్క రక్తదానం చేసి ప్రాణాలను కాపాడండి

## డీఎంహెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్

### జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** జాతీయ స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాల్లో భాగంగా ప్రజల్లో రక్తదానంపై అవగాహన కల్పించేందుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి శనివారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ప్రారంభించారు. రక్తదానం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడంతో పాటు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ప్రజలను ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జాతీయ స్వచ్ఛంద రక్తదానానికి సంబంధించిన వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. "మానవత్వం చాటండి.. ఒక చుక్క రక్తదానం చేయండి.. ప్రాణాలను కాపాడండి" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు తెలిపారు. గాంధీ జయంతిని





పురస్కరించుకుని అక్టోబర్ 1వ తేదీన జిల్లాలో రక్తదాన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గర్భిణులు, బాలింతలు, సికిల్‌సెల్, తలసీమియా బాధితులు, క్రిటికల్ కేర్ రోగులకు రక్తం ఎంతో అవసరమని అన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం లేనందున ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని కోరారు. జిల్లాలోని ఆరోగ్య సిబ్బంది రక్తదానం ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డాక్టర్ నరేందర్ రాథోడ్ ఆదేశించారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలను స్వచ్ఛంద రక్తదానం వైపు ప్రోత్సహించాలని సూచించారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకులు డాక్టర్ అశోక్ కుమార్, డాక్టర్ సుధాకర్ నాయక్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రమ్య, డాక్టర్ అమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, రషీద్, అల్లాడి శ్రీనివాస్, నాందేవ్, పుట్ట సత్తయ్య, వెంకటేశ్వర్లు, రెడ్‌క్రాస్ సంస్థకు చెందిన శ్రీ మహేందర్, వారి సిబ్బంది, సికిల్‌సెల్--తలసీమియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు శ్రీనివాస్, వారి సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ అధికారులు, ఐసీటీసీ సిబ్బంది, దిశా సిబ్బంది, ఎన్‌జీవోల ప్రతినిధులు, ఆరోగ్య ఆశా కార్యకర్తలు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బెజ్జూర్ మండల రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**బెజ్జూర్19 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** రజకుల ఆత్మీయ సమ్మేళన సమావేశం శనివారం నిర్వహించారు మండలంలోని రజక పెద్దలు, నాయకులు హాజరయ్యారు.రజక పెద్దల సమక్షంలో బెజ్జూర్ మండల రజక సంఘం అధ్యక్షులుగా రామడుగుల రమేష్ గారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.అదేవిధంగా నూతన కమిటీగా ఏర్పాటు చేశారు ఉపాధ్యక్షులు: పొన్న రాకేష్, దేవనపల్లి నవీన్, చంద్రగిరి రాకేష్. ప్రధాన కార్యదర్శి: కుదురుపాక సంజీవ్ కోశాధికారి. రాదండి మహేష్ప్రచార కార్యదర్శి: పొన్న ప్రవీణ్ సలహాదారు. అన్నారం శ్రీనివాస్.కార్యవర్గ సభ్యులు.పొన్న మహేష్, రాదండి అంకులు, రామగిరి సుధాకర్, రామడుగుల మహేష్, జంగంపల్లి సురేష్, చంద్రగిరి శంకర్, ఇసపల్లి మధుకర్, రాదండి భాస్కర్ మండల రజక సంఘం నాయకులు పాల్గొన్నారు జరిగింది.నూతనంగా ఎన్నికైన కమిటీకి రజక సంఘం పెద్దలు, సభ్యులు అభినందనలు తెలిపారు.



# తెలంగాణ యువతకు ఉద్యోగాలు ఎక్కడ? పదేళ్ల పాలనపై కేసీఆర్--కేటీఆర్ సమాధానం చెప్పాలి

**తెలంగాణ యువత, నిరుద్యోగులు, పేదలు, కాంగ్రెస్ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను**

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**మంచిర్యాల, 19,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ ఉద్యమ సమయంలో పేదలు, నిరుద్యోగులు, యువత భవిష్యత్తు, నీళ్లు--నిధులు--నియామకాల పేరుతో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిన గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ విమర్శలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్, కేటీఆర్‌లు రాష్ట్ర యువతకు ఇచ్చిన హామీలపై ప్రజలకు సమాధానం చెప్పాలని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగాలు, నిరుద్యోగ సమస్య, పేదలకు ఇళ్లు, భూముల విషయంలో గత ప్రభుత్వం ఏం చేసిందో ప్రజల ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పేద కుటుంబాల సమస్యలు, ప్రజల సంక్షేమం గురించి మాట్లాడిన నాయకత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలను ఎంతవరకు పరిష్కరించిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఎన్నో సంవత్సరాలు ఉద్యోగాల కోసం ఎదురుచూశారని, తెలంగాణ ఉద్యమంలో 'నియామకాలు' ప్రధాన నినాదంగా ఉన్నప్పటికీ గత పదేళ్ల పాలనలో యువత ఎదుర్కొన్న నిరుద్యోగ సమస్యపై సమగ్ర సమాధానం కావాలని వంశీకృష్ణ అన్నారు. ఉద్యోగాల కోసం పోరాడిన ప్రతి నిరుద్యోగి కుటుంబం బాధను కాంగ్రెస్ పార్టీ అర్థం చేసుకుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో భూములు, ప్రభుత్వ వనరుల వినియోగం, ప్రజా ధనం తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ఆరోపణలకు పరిమితం కాకుండా ఆధారాలతో వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని అన్నారు. "కాకా" గడ్డం వెంకటస్వామి పేదలు, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం పనిచేశారని ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. సుమారు 75 వేల మంది పేదలకు గుడిసెలు ఇప్పించిన ఘనత ఆయనదేనని తెలిపారు. కాకా వెంకటస్వామి చూపిన ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగించడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజల కోసం పనిచేస్తానని, ముఖ్యంగా నిరుద్యోగ యువతకు న్యాయం జరిగే వరకు వారి సమస్యలను లేవనెత్తుతానని చెప్పారు. ఉద్యోగాలు, ఉపాధి, పేదల సంక్షేమం విషయంలో ప్రజల గొంతుకగా ఉంటానని స్పష్టం చేశారు. తెలంగాణలోని నిరుద్యోగ యువతతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఎంపీ తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా వారి సమస్యలను పార్లమెంట్‌తో పాటు ప్రజా వేదికలపై బలంగా ప్రస్తావిస్తానన్నారు. తెలంగాణ యువత, నిరుద్యోగులు, పేదలు, కాంగ్రెస్ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. కేసీఆర్--కేటీఆర్ పాలనలో జరిగిన ప్రతి అంశంపై ప్రజలకు వాస్తవాలు తెలియాలని, రాజకీయ ఆరోపణలు కాకుండా ఆధారాలతో నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని అన్నారు.



తెలంగాణ ప్రజల ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ వెనక్కి తగ్గదని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేరేవరకు విశ్రమించేది లేదు

## సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి

## అసెంబ్లీలో కార్మికుల గొంతుకగా నిలిచిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల దశాబ్దాల నాటి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా తమ యూనియన్ పనిచేస్తోందని, ఈ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారమయ్యే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి స్పష్టం చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ , గత ఆరు సంవత్సరాలుగా సీఐటీయూ నేతృత్వంలో సింగరేణి కార్మికులకు సొంతింటి స్థలాలు కేటాయించాలని సుదీర్ఘ పోరాటాలు నిర్వహిస్తున్నామని రాజారెడ్డి తెలిపారు. ఈ సమస్యను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన శాసనసభలో కార్మికుల గొంతుకగా నిలిచి ఈ అంశాన్ని ప్రస్తావించారని, కార్మికుల సుదీర్ఘ విన్నపాన్ని మన్నించి అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యేకు యూనియన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి కార్మికుల సొంతింటి పథకానికి సంబంధించిన తొలి పునాది రాయి గోదావరిఖనిలోనే పడాలని, అనంతరం సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లోనూ ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఇందుకోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు ఇతర మంత్రులతో మాట్లాడి తగిన చొరవ చూపాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. గత మూడు సంవత్సరాలుగా సీఐటీయూ ప్రతినిధి బృందం ప్రజాప్రతినిధులతో పాటు సింగరేణి సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, ఇతర డైరెక్టర్లను కలిసి సొంతింటి స్థలాల అంశంపై సమగ్ర నివేదికను అందించినట్లు రాజారెడ్డి వివరించారు. తాము సమర్పించిన నివేదికపై యాజమాన్యం సానుకూలంగా అధ్యయనం చేస్తోందని, ఈ అంశం 100 శాతం కార్మికులకు మేలు చేసేదిగా కంపెనీ కూడా భావిస్తోందని తెలిపారు. రెవెన్యూ శాఖ పరిధిలోని 76 జీవో ఆధారంగా సింగరేణి భూములను ఇతర అవసరాలకు కేటాయించకుండా, దశాబ్దాలుగా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న సింగరేణి కార్మికులకే సొంతింటి నిర్మాణాల కోసం కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.ప్రస్తుతం సింగరేణి వ్యాప్తంగా 1,360 ఎకరాల ఖాళీ భూమి అందుబాటులో ఉందని, అలాగే నివాసయోగ్యంగా లేక 18,800 క్వార్టర్లు నిరుపయోగంగా పడి ఉన్నాయని రాజారెడ్డి తెలిపారు. వీటిని కూల్చివేసి కొత్త క్వార్టర్లు నిర్మించాలంటే కంపెనీకి సుమారు రూ.8,000 కోట్ల వరకు వ్యయం అవుతుందని, దానిపై వడ్డీ భారం ఏటా సుమారు రూ.800 కోట్లు అవుతుందని వివరించారు. దీనికి బదులుగా కార్మికులే సొంతంగా ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పిస్తే కంపెనీపై ఎలాంటి ఆర్థిక భారం పడదని స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం ఈ పథకం సాధ్యం కాదని, సిరిసిల్ల లేదా హైదరాబాద్‌లో ఇళ్లు ఇస్తారంటూ దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. 35 ఏళ్ల పాటు సింగరేణి సంస్థలో రక్తాన్ని చెమటగా మార్చి సేవలందించిన కార్మికుడికి తాను పనిచేసిన ప్రాంతంలో కాకుండా సుదూర ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు . ఉద్యోగ సర్వీసుతో నిమిత్తం లేకుండా, రిటైర్డ్ అయిన తర్వాత కూడా కార్మికులు ప్రశాంతంగా జీవించేందుకు, ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రతి కార్మికుడికి సొంత ఇల్లు ఉండేలా అపార్ట్‌మెంట్లు లేదా ఇండివిడ్యువల్ ప్లాట్ల రూపంలో స్థలాలు కేటాయించాలని రాజారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అన్ని కార్మిక సంఘాలు కలిసికట్టుగా భాగస్వాములై సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు కుమారస్వామి, ఆరెపల్లి రాజమౌళి, కుంట ప్రవీణ్ కుమార్, అంబల శ్రీనివాస్, సోమవారపు వెంకన్న, శ్రీహరి, వినేష్ తదితరులు పాల్గొన్నారు.




# డబ్బు రాజకీయాల జబ్బును వదిలిస్తాం

**రాజ్యాధికారమే టీఆర్పీ అంతిమ లక్ష్యం**

**తీన్మార్ మల్లన్న పాదయాత్రను విజయవంతం చేద్దాం**

**టీఆర్పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ**

**రాజ్యాధికార యాత్రకు మద్దతుగా బైక్ ర్యాలీ**





**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** బహుజనుల రాజ్యాధికారంతోనే సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ అన్నారు. తీన్మార్ మల్లన్న చేపట్టిన రాజ్యాధికార పాదయాత్రకు మద్దతుగా మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలో శనివారం బైక్ ర్యాలీని నిర్వహించారు. భీమారం మండల అధ్యక్షు లు దెబ్బెట శంకర్, మండల ప్రధాన కార్యదర్శి తగరం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ వర్మ మాట్లాడు తూ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న రాజ్యాధికారమే లక్ష్యంగా రాజ్యాధికార పాదయాత్రను ప్రారంభిం చారని తెలిపారు. రాజ్యాధికార ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ, ఎవరికి వారికంత వాటా అందించాలనే లక్ష్యంతో ఈ యాత్రను జిల్లావ్యాప్తంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతం చేసే దిశగా జిల్లా, మండల నాయకత్వాలు పనిచేస్తాయని స్పష్టం చేశారు. వచ్చేది బీసీల రాజ్యమేనని, తీన్మార్ మల్లన్న నాయకత్వంలోనే బహుజనుల రాజ్యాధికారాన్ని సాధిస్తామని మహేష్ వర్మ ధీమా వ్యక్తం చేశారు. డబ్బు రాజకీయాల జబ్బును వదిలించి ప్రజా రాజకీయాలను ప్రజలకు అందించేందుకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ కృషి చేస్తోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజలను చైతన్యపరిచి రాజ్యాధికారం దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. బీసీ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కొందరు బీసీ ఉద్యమ ద్రోహులు దొరల వద్ద ఊడిగం చేస్తున్నారని ఆరోపించిన ఆయన, అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. రానున్న రోజుల్లో ప్రజలే వారికి బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. అగ్రవర్ణ నాయకుల రాజకీయ ఆధిపత్యాన్ని అంతం చేసి రాజ్యాధికారాన్ని ప్రజలకు అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న చేపడుతున్న రాజ్యాధికార యాత్రకు బహుజన వర్గాలన్నీ మద్దతు తెలిపి, కలిసికట్టుగా ముందుకు రావాలని, రాజ్యాధికార సాధనలో భాగస్వాములు కావాలని మహేష్ వర్మ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పడాల శివతేజ, మహమ్మద్ లతీఫ్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోని సింగరేణి యాజమాన్యం

## 70 మంది సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**మంచిర్యాల, 19,సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఇచ్చిన ఆదేశాలను, సింగరేణి జనరల్ మేనేజర్ ఇచ్చిన బహిరంగ హామీని సైతం సింగరేణి యాజమాన్యం పట్టించుకోవడం లేదని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (ఎస్‌సీకేఐఎస్--సీటీయూ) బెల్లంపల్లి రీజియన్ గౌరవాధ్యక్షుడు సంకె రవి, కార్యదర్శి దూలం శ్రీనివాస్ లు శనివారం ఆరోపించారు. మందమర్రి డివిజన్ పరిధిలో ఎస్అండ్‌పీసీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న సుమారు 70 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా వారి కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంకె రవి, దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. మందమర్రి డివిజన్ పరిధిలో సింగరేణి ఎస్అండ్‌పీసీ ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా గత 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికుల్లో సుమారు 50 మందిని గత నాలుగు నెలలుగా విధుల్లోకి తీసుకోకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు. మరో 19 మందిని గత టెండర్లలో జరిగిన చిన్నచిన్న పొరపాటులను సాకుగా చూపిస్తూ విధుల నుంచి తొలగించారని పేర్కొన్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి సుమారు 50 మందిని విధుల్లోకి తీసుకోకపోగా, విధుల్లోకి తీసుకున్న తర్వాత రిపోర్టుల పేరుతో మరో 19 మందిని తొలగించడంతో మొత్తంగా దాదాపు 70 మంది సెక్యూరిటీ గార్డులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. అధికారుల కారణంగా టెండర్ ప్రక్రియ నిలిచిపోయిన సమయంలో కొత్త టెండర్ పిలిచి



కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరుతూ దాదాపు నెల రోజుల పాటు పోరాటం నిర్వహించామని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, చెన్నూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించి సింగరేణి జీఎంతో మాట్లాడారని అన్నారు. కొత్త టెండర్ పిలిచి 213 మంది కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కల్పించకుండా అందరినీ విధుల్లోకి తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. జీఎం కూడా బహిరంగంగా అందరినీ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే కొత్త టెండర్ వచ్చిన తర్వాత ఇచ్చిన హామీని అమలు చేయకుండా సుమారు 70 మంది గార్డులను ఇప్పటికీ విధుల్లోకి తీసుకోలేదని సంకె రవి, దూలం శ్రీనివాస్ ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం గత రెండు నెలలుగా జీఎం కార్యాలయం, ఏరియా సెక్యూరిటీ అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ అధికారులు పొంతనలేని సమాధానాలతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా ఇదే ఉపాధిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న కార్మికులను అకారణంగా విధులకు దూరం చేయడం ఎంతవరకు సమంజసమో సింగరేణి అధికారులు ఆలోచించుకోవాలని వారు అన్నారు. సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న యాజమాన్యం, ఇప్పటికే ఉపాధి పొందుతున్న కార్మికుల కొలువులను తొలగించడం బాధాకరమని పేర్కొన్నారు. ఇది కేవలం 70 మంది సెక్యూరిటీ గార్డుల సమస్య మాత్రమే కాదని, వారి కుటుంబాల ఉపాధికి సంబంధించిన సమస్య అని అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, చెన్నూర్ ఎమ్మెల్యే మరోసారి స్పందించి సింగరేణి అధికారులతో మాట్లాడి 70 మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా చొరవ చూపాలని సంకె రవి, దూలం శ్రీనివాస్ కోరారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి సెక్యూరిటీ గార్డులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానిక ప్రజలను సమీకరించి 'చలో జీఎం కార్యాలయం' కార్యక్రమానికి కదులుతామని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల ఐక్య సంఘం (ఎస్‌సీకేఐఎస్--సీటీయూ) బెల్లంపల్లి రీజియన్ గౌరవాధ్యక్షుడు సంకె రవి, కార్యదర్శి దూలం శ్రీనివాస్ హెచ్చరించారు.


# సవరించిన పెన్షన్ అమలుకాక ఆందోళనలో పెన్షనర్

**పెరిగిన రూ.551 పెన్షన్ ఇప్పటికీ ఎందుకు చెల్లించడం లేదు**

**బొగ్గు గని పెన్షన ర్ తుమ్మలూరి మల్లారెడ్డి ఆవేదన**

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**సవరించిన పెన్షన్ ప్రకారం పెరిగిన మొత్తాన్ని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు తనకు చెల్లించకపోవడంపై మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో కోల్ కట్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగి తుమ్మలూరి మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సవరించిన పెన్షన్ అమలులోకి వచ్చినప్పటికీ ప్రతి నెల రావలసిన పెరిగిన పెన్షన్ మొత్తం తన ఖాతాలో జమ కావడం లేదని, పెరిగిన పెన్షన్ తనకు ఎందుకు చెల్లించడం లేదో అధికారులు స్పష్టం చేయాలని ఆయన కోరారు. కోల్ మైన్స్ పెన్షన్ పథకం నిబంధనల ప్రకారం పదవీ విరమణ పొందిన తుమ్మలూరి మల్లారెడ్డికి పాత పెన్షన్ పే ఆర్డర్ ప్రకారం నెలకు రూ.18,062 పెన్షన్ నిర్ణయించారు. అనంతరం 11వ వేజ్ బోర్డు అమలుతో జీతభత్యాల సవరణ జరిగిన నేపథ్యంలో కొత్త పెన్షన్ పే ఆర్డర్ జారీ చేసి నెలవారీ పెన్షన్‌ను రూ.18,613కు పెంచారు. సవరించిన పెన్షన్‌కు సంబంధించి రూ.27,550 బకాయిలను కూడా చెల్లించారు. అయితే, కొత్త పెన్షన్ పే ఆర్డర్ ప్రకారం ప్రతి నెల అదనంగా రావలసిన రూ.551 మాత్రం ఇప్పటివరకు తనకు చెల్లించడం లేదని మల్లారెడ్డి తెలిపారు. సవరించిన పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసి, బకాయిలను సైతం చెల్లించినప్పుడు నెలవారీ పెన్షన్‌లో పెరిగిన రూ.551 ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులను సంప్రదించినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. తనలాంటి పెన్షనర్లకు ప్రతి నెల పెన్షన్ ఎంతో ముఖ్యమని, అధికారులు ఒకసారి పరిశీలించి ఉత్తర్వుల ప్రకారం రావలసిన పెరిగిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. ఈ విషయమై గోదావరిఖని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ అధికారులను సంప్రదించగా, కోల్ మైన్స్ పెన్షన్ చెల్లింపులకు నోడల్ బ్యాంకుగా వ్యవహరిస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ధన్‌బాద్ శాఖకు ఈ అంశాన్ని తెలియజేసినట్లు అధికారులు తెలిపారని మల్లారెడ్డి పేర్కొన్నారు. అయితే, సమస్యను ఎస్‌బీఐ ధన్‌బాద్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు పెరిగిన పెన్షన్ అమలు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.





**బొగ్గు గని పెన్షన ర్ తుమ్మలూరి మల్లారెడ్డి ఆవేదన**

**బొగ్గు గని పెన్షన ర్ తుమ్మలూరి మల్లారెడ్డి సమస్యను త్వరగా పరిష్కరించాలి : ఆళవందార్ వేణు మాధవ్**

ఈ సమస్యపై సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ శనివారం స్పందించారు . సవరించిన పెన్షన్ పే ఆర్డర్ ప్రకారం తుమ్మలూరి మల్లారెడ్డికి రావలసిన పెరిగిన రూ.551 నెలవారీ పెన్షన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపునకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసి, రూ.27,550 బకాయిలు చెల్లించినప్పటికీ నెలవారీ పెంపు మాత్రం అమలు కాకపోవడం సరికాదన్నారు. మల్లారెడ్డి పెన్షన్‌కు సంబంధించిన వివరాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న మొత్తంతో పాటు ప్రతి నెల రావలసిన రూ.551ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, ఎస్‌బీఐ ధన్‌బాద్ అధికారులను కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రత్యేక గ్రీవెన్స్ వ్యవస్థను కలిగి ఉన్నందున, పెన్షనర్ల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి వారికి న్యాయం చేయాలని అసోసియేషన్ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆళవందార్ వేణు మాధవ్ స్పష్టం చేశారు.

# సింగరేణి ఎన్నికలను వెంటనే నిర్వహించాలి

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి**

**శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ-1 గనిలో టీజీబీకేఎస్ ద్వార సమావేశం**

**భారీగా టిబిజికేఎస్ లో కార్మికుల చేరికలు**

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో వెంటనే సింగరేణిలో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికేఎస్)రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ-1 గనిలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ద్వార సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని కార్మికులను, మహిళా కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సింగరేణి కార్మికులకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా ఉన్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేశాయని రాజిరెడ్డి ఆరోపించారు. వారి కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. రిజిస్టర్డ్ సంఘాలను కలుపుకొని డీవైసీఎల్‌సీ, సింగరేణి సీఎండీ, డైరెక్టర్ పర్సనల్‌కు మెమోరాండాలు అందజేసి ఎన్నికలు నిర్వహించాలని కోరినట్లు తెలిపారు. సింగరేణిలో నిర్వహించే కార్యక్రమాలకు అన్ని యూనియన్లను సమానంగా ఆహ్వానించాలని గతంలోనే కోరినట్లు తెలిపారు . కొంతమంది సంఘాల నాయకులు తమ తప్పులను ఎత్తిచూపుతున్నందుకు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంపై ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారని, విమర్శలు చేసే నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని రాజిరెడ్డి సూచించారు. కార్మికులు వ్యతిరేకిస్తున్నప్పటికీ పలు గనుల్లో తమ సమావేశాలకు ఆటంకాలు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలను గతంలో రద్దు చేసి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాటంతో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో తిరిగి సాధించుకున్నామని రాజిరెడ్డి పేర్కొన్నారు. వారసత్వ ఉద్యోగాల కారణంగానే సుమారు 16 వేల మంది యువత సింగరేణిలో ఉద్యోగాల్లోకి వచ్చారని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో సెప్టెంబర్ 16న 250 టన్నుల లక్ష్యానికి గాను 369 టన్నుల ఉత్పత్తి సాధించడంలో యువ కార్మికుల పాత్ర ఉందన్నారు. సింగరేణిలోకి వచ్చిన యువత, మహిళలు పైరవీల ద్వారా ఉద్యోగాలు పొందారంటూ జరుగుతున్న ప్రచారంపై ఆయన తీవ్రంగా స్పందించారు. దీనిపై దమ్ముంటే చర్చకు రావాలని, విజిలెన్స్ విచారణలో ఎంతమంది పట్టుబడ్డారో వెల్లడించాలని సవాల్ చేశారు. 16 నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించలేదని, అనంతరం నిర్వహించిన మెడికల్ బోర్డులో కూడా పెద్ద సంఖ్యలో అభ్యర్థులు అన్ఫిట్ కాలేదని తెలిపారు. అభ్యర్థులు సమర్పించిన వైద్య నివేదికల్లో పేర్కొన్న అనారోగ్య సమస్యల ఆధారంగానే అన్ఫిట్ చేస్తున్నారని వివరించారు. సింగరేణిలో స్పేర్ పార్ట్స్ కొరత కారణంగా కార్మికులపై పని భారం పెరుగుతోందని రాజిరెడ్డి అన్నారు. అవసరమైన స్పేర్ పార్ట్స్‌ను అందుబాటులో ఉంచి కార్మికులకు సహకరించాలని యాజమాన్యాన్ని కోరారు. సింగరేణిని నిర్వీర్యం చేసే విధంగా జరుగుతున్న చర్యలపై ఇతర కార్మిక సంఘాలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సింగరేణి లాభాలను వెంటనే ప్రకటించాలని, గత ఏడాది మాదిరిగా లాభాలను పక్కన పెట్టకుండా కార్మికులకు నాణ్యమైన లాభాల వాటా అందించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 36 శాతం లాభాల వాటా ఇవ్వాలని కోరారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ లాభాల వాటా సాధించిన చరిత్ర తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘానిదేనని తెలిపారు. సకల జనుల సమ్మె వేతనం, ప్రత్యేక ఇంక్రిమెంట్, పీఎంఈలో రెండో కాన్పు డెలివరీ అవకాశం, ఉచిత విద్యుత్, ఉచిత ఏసీ సౌకర్యం, రూ.10 లక్షల వడ్డీలేని రుణం, పీహెచ్‌డీల పెంపు, విలువైన క్యాడర్ స్కీములు, వయోపరిమితి పెంపు తదితర అనేక సౌకర్యాలను కార్మికులకు సాధించామని రాజిరెడ్డి వివరించారు. టీజీబీకేఎస్‌పై తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా టీజీబీకేఎస్ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై ఎస్ఆర్పీ-1 గనిలో వివిధ యూనియన్లలో పనిచేస్తున్న సుమారు 70 మంది కార్మికులు మిర్యాల రాజిరెడ్డి సమక్షంలో టీజీబీకేఎస్ కండువాలు కప్పుకుని సంఘంలో చేరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పెట్టం లక్ష్మణ్, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ పానుగంటి సత్తయ్య, బ్రాంచ్ సెక్రటరీలు వెంగల కుమారస్వామి, బుస రమేష్, తొంగల రమేష్, బ్రాంచ్ నాయకులు పెండ్రి రవీందర్‌రెడ్డి, తిరుపతిరావు, సముద్రాల అన్వేష్, నీలం సదయ్య, మైన్ ఫిట్ సెక్రటరీ కురుమ వికాస్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ మేడం తిరుపతి, మైన్ ముఖ్య నాయకులు బండి శ్రీకాంత్, సతీష్, కొమ్ముర‌వి, రాజేశం, తిరుపతిరవి, చేందర్, రాజేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు, కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలు

## రాంనగర్‌లోని శ్రీ వీర హనుమాన్ మందిర్ లో "అన్నదాన" కార్యక్రమం







**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రతిరోజూ ధూపదీప నైవేద్యాలతో గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో మండపాలను సందర్శించి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని రాంనగర్‌లో గల శ్రీ వీర హనుమాన్ మందిర్ వద్ద వినాయక చవితి ఉత్సవాలను భక్తిపూర్వకంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహిస్తూ గణనాథునికి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాతలుగా చిలువేరు మహేష్, చిలువేరు రవీందర్, గౌతమి--సుప్రియ దంపతులు భక్తిపూర్వకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ చిలువేరు జ్యోతి శ్రీనివాసులు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన పూజారి వెంకట శర్మ మాట్లాడుతూ, వినాయక చవితి పర్వదినం భక్తులకు ఆధ్యాత్మిక శక్తిని, సుఖసంతోషాలను ప్రసాదించే పవిత్రమైన రోజని అన్నారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే కుటుంబాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో గణనాథుని పూజించి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. అన్నదానం మహాదానమని, వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఎంతో పుణ్యకార్యమని ఆయన పేర్కొన్నారు. భక్తులందరికీ శ్రీ వినాయక స్వామివారి ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడి, గణపతి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# అధికారుల డుమ్మా.. సమస్యలకు పరిష్కారం కరవు

**గందరగోళంగా మండల పరిషత్ సమీక్ష సమావేశం ప్రజా సమస్యలపై సభ్యుల నిలదీత.. సమాధానాల్లో స్పష్టత కరవు**

**సమావేశానికి రాని అధికారులు.. కింది స్థాయి సిబ్బందితోనే సరిపెట్టుకున్న వైనం సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు ధ్వజం**







**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబరు 19 (ప్రజాజ్యోతి):** వాంకిడి మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, విద్యుత్, వైద్యం, వ్యవసాయం, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆశించిన స్థాయిలో సాగలేదనే అసంతృప్తి సభ్యుల్లో వ్యక్తమైంది. కీలక శాఖలకు చెందిన బాధ్యత కలిగిన అధికారులు సమావేశానికి స్వయంగా హాజరు కాకపోవడం, వారి స్థానంలో కింది స్థాయి సిబ్బందిని పంపించడంతో ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై నిలదీశారు. సమావేశంలో ప్రస్తావించిన అనేక సమస్యలకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు, పరిష్కారానికి నిర్దిష్ట గడువు తెలియకపోవడంతో సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడంతో మండల సమావేశాల్లో ప్రస్తావిస్తున్నామని, ఇక్కడ కూడా స్పష్టత రాకపోతే సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు.

### సమావేశ సమాచారంలోనూ జాప్యం

ప్రజా సమస్యలపై జరిగే మండల పరిషత్ సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని కొంతమంది పాత్రికేయులకు ఆలస్యంగా తెలియజేయడంపై కూడా చర్చ జరిగింది. సమావేశాలు ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, మీడియాకు పారదర్శకంగా అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశం ప్రారంభమయ్యే సమయానికి సమాచారం అందడం లేదా ఆలస్యంగా తెలియజేయడం వల్ల సమావేశ కార్యకలాపాలను పూర్తిస్థాయిలో కవర్ చేయడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పాత్రికేయ వర్గాలు పేర్కొన్నాయి. మండల పరిషత్ సమావేశాల సమాచారం విషయంలో ఎలాంటి జాప్యం, వివక్షకు తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కోరుతున్నారు. అధికారుల గైర్హాజరుపై సభ్యుల నిలదీత సమావేశంలో ప్రధానంగా అధికారుల గైర్హాజరు అంశమే చర్చకు వచ్చింది. ప్రజల సమస్యలకు నేరుగా సమాధానం చెప్పాల్సిన అధికారులు హాజరు కాకపోవడం వల్ల కింది స్థాయి సిబ్బంది ఇచ్చే సమాధానాలతో సభ్యులు సంతృప్తి చెందలేకపోయారు. తమ శాఖ పరిధిలోని సమస్యలపై పూర్తి సమాచారం, నిధుల పరిస్థితి, పనుల పురోగతి, పరిష్కారానికి తీసుకోబోయే చర్యలు వంటి విషయాలపై సంబంధిత అధికారులు మాత్రమే స్పష్టత ఇవ్వగలరని సభ్యులు పేర్కొన్నారు. కేవలం సిబ్బందిని పంపించి సమావేశాన్ని ముగించే విధానం వల్ల ప్రజా సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు.

### గత సమావేశంలో చెప్పినా.. చర్యలు ఎక్కడ?

విద్యుత్ శాఖకు సంబంధించి సభ్యులు తీవ్రంగా ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని సుమారు 45 రోజుల క్రితమే జరిగిన సమావేశంలో సూచించినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని తెలిపారు. ప్రమాదకరంగా మారిన స్తంభాల వద్ద ఎప్పుడైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాలను కూడా అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదని అన్నారు. సమస్యను గుర్తించిన వెంటనే సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రైతు సమస్యలపై విస్తృత చర్చ

వ్యవసాయ రంగానికి సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చాయి. ముఖ్యంగా యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు తెలిపారు. పంటలకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ప్రైవేటు మార్కెట్‌పై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, సరఫరా విధానం, పంపిణీపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. రైతులు గంటల తరబడి తిరిగే పరిస్థితి లేకుండా గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి సరఫరా చేయాలని సూచించారు.

### అడవి పందుల బెడదపై శాశ్వత చర్యలు

పంట పొలాల్లోకి అడవి పందులు ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తున్నాయని పలువురు సభ్యులు తెలిపారు. విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు పెట్టి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో అడవి పందుల కారణంగా నష్టం వాటిల్లుతోందని సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు అన్నారు. రైతులు పంటలను రక్షించుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను కేవలం రైతుల సమస్యగా కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాల్సిన అంశంగా చూడాలని కోరారు. అడవి పందుల నివారణకు శాస్త్రీయ పద్ధతులను పరిశీలించాలని, పంట పొలాల రక్షణకు అవసరమైన సాంకేతిక పరిష్కారాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంట నష్టంపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### వైద్య సేవలపై సభ్యుల అసంతృప్తి

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు మరింత బలోపేతం కావాలని సభ్యులు కోరారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది, మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఇతర ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితులు తగ్గేలా స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సభ్యులు కోరారు.

### గ్రామాల అభివృద్ధిపై సర్పంచుల ఆవేదన

గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు సర్పంచులు తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త సేకరణ, రహదారుల సంరక్షణ, కాలువల శుభ్రత తదితర పనులకు అవసరమైన వాహనాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించినా వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు, వనరులు లేకపోతే ప్రజలకు సమాధానం చెప్పడం కష్టంగా మారుతోందని తెలిపారు. మండల, జిల్లా స్థాయి అధికారులు గ్రామపంచాయతీలకు అవసరమైన సహకారం అందించాలని కోరారు.

### సమీక్ష సమావేశాలు కేవలం తంతుగా మారకూడదు

మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు కేవలం హాజరు, చర్చలు, తీర్మానాలకే పరిమితం కాకుండా ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించే వేదికలుగా ఉండాలని సభ్యులు పేర్కొన్నారు. గత సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపై ఏం చర్యలు తీసుకున్నారు? ఏ పనులు పూర్తయ్యాయి? ఏవి పెండింగ్‌లో ఉన్నాయి? వాటి కారణాలు ఏమిటి? తదుపరి చర్యలు ఏమిటి? అనే వివరాలను ప్రతి శాఖ అధికారి సమర్పించే విధానం ఉండాలని సూచించారు. సమస్యలను నమోదు చేసి వదిలేయకుండా ప్రతి అంశానికి బాధ్యత కలిగిన అధికారిని గుర్తించి, పరిష్కారానికి గడువు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

### కలెక్టర్ జోక్యం చేసుకోవాలి

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారుల వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని సింగిల్ విండో చైర్మన్ జాబొరే పెంటు కోరారు. ప్రజల సమస్యలు వినేందుకు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసేందుకు సిద్ధంగా లేని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల స్థాయి సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం సాధారణ విషయంగా మారకూడదని, సంబంధిత శాఖల బాధ్యత కలిగిన అధికారులు తప్పనిసరిగా హాజరై తమ శాఖకు సంబంధించిన అంశాలపై సమాధానం చెప్పే విధానం ఉండాలని అన్నారు.

### ప్రజల సమస్యలే ప్రాధాన్యం

మండల పరిధిలోని ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడమే మండల పరిషత్ సమావేశాల ప్రధాన ఉద్దేశమని సభ్యులు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాల నుంచి తీసుకువచ్చే సమస్యలను అధికారులు ప్రాధాన్యంతో పరిగణించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని అన్నారు. సమావేశాలకు అధికారులు హాజరై సమస్యలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు, సమావేశం అనంతరం కూడా వాటి పరిష్కారంపై పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం, నిర్లక్ష్యానికి తావులేకుండా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో ప్రజల్లో ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం దెబ్బతినే అవకాశం ఉందని సభ్యులు పేర్కొన్నారు.

# కార్మికులను తప్పుదోవ పట్టిస్తే హెచ్ఎంఎస్ నాయకులకు తగిన బుద్ధి చెప్తాం

**సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్**

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి బొగ్గు గని కార్మికుల హక్కుల పోరాటంలో సీఐటీయూకు పెరుగుతున్న ప్రజాదరణ ను చూసి ఓర్వలేక హెచ్ఎంఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ఈ నెల 17న జేఏసీ ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎల్సీ, సింగరేణి సీఎండీ, డైరెక్టర్ (పా)లకు ఉమ్మడిగా వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు జరిగేంతవరకు కార్మిక సంఘాలన్నింటినీ సమానంగా చూడాలని కోరినట్లు తెలిపారు. ఉమ్మడి కార్యక్రమం అనంతరం సీఐటీయూ తరపున ప్రత్యేకంగా సింగరేణి కార్మికులకు 'సొంతింటి పథకం' అమలు చేయాలని కోరుతూ, కంపెనీకి రూపాయి నష్టం లేకుండా సిద్ధం చేసిన ప్రాజెక్టు నివేదికను అధికారులకు సమర్పించినట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ప్రత్యేకంగా వినతిపత్రం అందజేసే సమయంలో అక్కడే ఉన్న హెచ్ఎంఎస్ నాయకులు స్వయంగా ఫోటోలు తీసుకున్నారని, ప్రస్తుతం సీఐటీయూకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆ ఫోటోలను 'ఫేక్' అంటూ ప్రచారం చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికుల సెటిల్మెంట్పై కూడా హెచ్ఎంఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, సంబంధిత ఒప్పంద పత్రాలపై హెచ్ఎంఎస్ నాయకుల సంతకాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. హెచ్ఎంఎస్ నాయకుడు రియాజ్ అహ్మద్ వెంటనే కార్మికులకు, సీఐటీయూకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి నిరాధార, అసత్య ప్రచారాలతో కార్మికులను తప్పుదోవ పట్టిస్తే హెచ్ఎంఎస్ కుట్రలను కార్మిక క్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. హెచ్ఎంఎస్ చేస్తున్న ప్రచారాలను కార్మికులు నమ్మవద్దని, సీఐటీయూకు కార్మికులందరూ అండగా నిలవాలని కుంట ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# కలెక్టర్ చొరవతో వృద్ధుడిని ఇంటికి చేర్చిన కుమారుడు

## ఆపదలో ఉన్న వృద్ధుడికి జిల్లా యంత్రాంగం అండ

## కుటుంబ సభ్యులతో మాట్లాడి బాధ్యతలు గుర్తుచేసిన కలెక్టర్ కె.హరిత

## తండ్రిని ఇకపై తానే చూసుకుంటానని హామీ ఇచ్చిన కుమారుడు




**ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి** కుటుంబ సభ్యుల ఆదరణకు దూరమై, తనను కుమారుడు పట్టించుకోవడం లేదంటూ ఆవేదనతో కలెక్టరేట్కు వచ్చిన ఓ వృద్ధుడిని జిల్లా కలెక్టర్ కె.హరిత చొరవతో తిరిగి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చారు. ఆపదలో ఉన్న వృద్ధుడికి తక్షణ సహాయం అందించడంతో పాటు, కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. కాగజ్నగర్ మండలం బోడేపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య అనే వృద్ధుడు తన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని, పోషణ బాధ్యతలు నిర్వహించడం లేదని పేర్కొంటూ ఈ నెల 18న సమీకృత జిల్లా కలెక్టరేట్కు వచ్చారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ కె.హరిత వెంటనే స్పందించి వృద్ధుడి వద్దకు స్వయంగా వెళ్లి ఆయన పరిస్థితి, కుటుంబ నేపథ్యం, ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధుడి భద్రత, సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**కుమారుడితో మాట్లాడిన కలెక్టర్**

వృద్ధుడి పరిస్థితి గురించి తెలుసుకున్న ఆయన కుమారుడు స్పందించి, ఇకపై తండ్రి పోషణ బాధ్యతను తానే పూర్తిగా స్వీకరిస్తానని అధికారులకు హామీ ఇచ్చారు. తండ్రిని ప్రేమగా, ఆప్యాయంగా చూసుకుంటానని, తిరిగి ఇంటికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కె.హరిత కుమారుడితో మాట్లాడి వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదుకోవడం, వారి అవసరాలు తీర్చడం కుటుంబ సభ్యుల బాధ్యత అని వివరించారు. వృద్ధుడికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రేమ, ఆప్యాయత, భద్రత, సంరక్షణ అందించాలని సూచించారు. కలెక్టర్ చొరవతో కుమారుడు తండ్రిని తిరిగి ఇంటికి తీసుకెళ్లడంతో వృద్ధుడు సంతోషం వ్యక్తం చేశారు. తన సమస్యకు స్పందించి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చిన జిల్లా కలెక్టర్కు కృతజ్ఞతలు తెలిపారు.

**వృద్ధులకు అండగా నిలవాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ.. వృద్ధులు కుటుంబానికి భారంగా కాకుండా అనుభవంతో మార్గనిర్దేశం చేసే పెద్దలని అన్నారు. వృద్ధాప్యంలో వారికి కుటుంబ సభ్యుల అండ, ఆప్యాయత, భద్రత ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ వారి గౌరవం, భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# యువత డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యవంతులను చేయాలి

**: జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజేశ్వరరావు**



**దండపల్లి, సెప్టెంబర్ 19(ప్రజాజ్యోతి):**యువకులు డ్రగ్స్, గంజాయి వంటి చెడు వ్యసనాల బారిన పడకుండా వారిలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) సంగర్ల రాజేశ్వరరావు అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో "ఖాఖా యూట్యూబ్' ఛానల్ ఆధ్వర్యంలో నిర్మించిన 'చివరి శ్వాస' షార్ట్ ఫిలింను పదవ తరగతి విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రాజేశ్వరరావు మాట్లాడుతూ... డ్రగ్స్, గంజాయి నివారణే ధ్యేయంగా ఇటువంటి సందేశాత్మక షార్ట్ ఫిలిం తీయడం అభినందనీయమని కొనియాడారు. సమాజంలో యువతను సరైన మార్గంలో నడిపించేందుకు కళాకారులు తమ వంతుగా ఇలాంటి మరిన్ని చిత్రాలను రూపొందించి చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షార్ట్ ఫిలిం యూనిట్ సభ్యులు అల్లంల కుమారస్వామి యాదవ్, దూసర రవీందర్, పాఠశాల ఉపాధ్యాయులు అప్పల మనోహర్, తిరుపతి, శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ప్రారంభం



**దండేపల్లి సెప్టెంబర్ 19(ప్రజాజ్యోతి):** భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా పక్షం' కార్యక్రమంలో భాగంగా శనివారం దండేపల్లి మండలంలోని నంబాల, వెల్గనూర్ మరియు ద్వారకా గ్రామాల్లో రఘునాథ్ వేరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ శిబిరాలను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వేరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథ్ వేరబెల్లి మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా వారం రోజుల పాటు వివిధ రకాల సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని, పరీక్షల అనంతరం అవసరమైన బాధితులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయిస్తామని వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు దేగ బాపు, గోపతి రాజయ్య, బెడద సురేష్, పత్తిపాక సంతోష్, బత్తుల శేఖర్, బందే సత్యం, మొరుపుటల సంజీవ్, గడికొప్పుల సురేందర్, ఎంబడి సురేందర్, నలిమెల మహేష్, లక్కాకుల బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# అడ్డా కార్మికులకు ప్రత్యేక స్థలం కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలి

## హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్

## పెద్దపల్లి ఎంపీకి వినతిపత్రం

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల పట్టణంలో రోడ్ల పక్కన నిలబడి ఉపాధి కోసం ఎదురుచూస్తున్న అడ్డా కార్మికులకు శాశ్వతంగా ప్రత్యేక స్థలం కేటాయించి, షెడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) మంచిర్యాల జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు . ఈ మేరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడికి హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు, దినసరి కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు ప్రతిరోజూ ఓవర్‌బ్రిడ్జి ప్రాంతం, ముక్రం చౌరస్తా తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన నిలబడి పనుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అడ్డా కార్మికులకు ప్రత్యేక స్థలం లేకపోవడంతో ఎండ, వర్షం, ట్రాఫిక్ మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో కార్మికులు నిలబడటం వల్ల వారి భద్రతకు ముప్పు ఏర్పడటంతో పాటు ప్రజలు, వాహనదారులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. అడ్డా కార్మికులకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణంలో ఉపాధి కోసం వేచి ఉండే అవకాశం కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. అడ్డా కార్మికుల కోసం శాశ్వత స్థలం కేటాయించడంతో పాటు ఎండ, వర్షం నుంచి రక్షణ కల్పించే షెడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, మహిళలు, పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు, బెంచీలు, ఫ్యాన్లు వంటి కనీస మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రజలు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అడ్డా ప్రాంతాన్ని సురక్షితంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అడ్డా కార్మికులను ఈ-శ్రమ, కార్మిక సంక్షేమ బోర్డులు, కేంద్ర ప్రభుత్వ అసంఘటిత కార్మిక సంక్షేమ పథకాలతో అనుసంధానం చేసేందుకు ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ సమస్యపై కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖలు, జిల్లా యంత్రాంగం, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని హెచ్ఎంఎస్ తరఫున విజ్ఞప్తి చేశారు. “అడ్డా కార్మికులకు కేవలం స్థలం కాదు.. గౌరవంగా నిలబడి ఉపాధి పొందే హక్కు కల్పించాలి” అనే లక్ష్యంతో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం హెచ్ఎంఎస్ నిరంతరం పోరాడుతుందని నరెడ్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి షఫీ, హెచ్ఎంఎస్ మంచిర్యాల సిటీ అధ్యక్షులు ఎండి హుస్సేన్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి తగురం శ్రీనివాస్, హెచ్ఎంఎస్ నాయకులు పల్లపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ స్టేషన్ల పనితీరు పక్కాగా ఉండాలి

## నేరాల నియంత్రణ.. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి

## పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి: డీఐజీ అంబర్ కిషోర్ ఝా

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా, ఐపీఎస్ సూచించారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువగా ఉండి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు.

**పోలీస్ స్టేషన్ పరిశీలన**

శనివారం డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్, వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్ పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని డీఐజీ స్వీకరించారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

**5ఎస్ విధానం అమలు**

పోలీస్ స్టేషన్లలో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డీఐజీ ఆదేశించారు. రికార్డులు, ఫైళ్లు, ముఖ్యమైన పత్రాలను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను నిర్లక్ష్యంగా ఉంచకుండా వాటిని క్రమపద్ధతిలో భద్రపరచాలని, వాహనాలకు సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

**పెండింగ్ కేసులపై ఆరా**

సర్కిల్ పరిధిలో నమోదైన తీవ్రమైన నేరాలు, దర్యాప్తులో ఉన్న కేసులు, పెండింగ్‌లో ఉన్న విచారణ కేసులకు సంబంధించిన సీడీ ఫైళ్లను డీఐజీ పరిశీలించారు. ఒక్కో కేసులో ఇప్పటివరకు జరిగిన దర్యాప్తు, నిందితుల అరెస్టులు, సేకరించిన ఆధారాలు, కేసుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

**నాణ్యమైన దర్యాప్తు అవసరం**

కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని డీఐజీ స్పష్టం చేశారు. నేరం జరిగిన తీరును అన్ని కోణాల్లో పరిశీలించి, ప్రతి చిన్న అంశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోవాలని సూచించా రు. నేరానికి సంబంధించిన అన్ని ఆధారాలను శాస్త్రీయంగా సేకరించి, దర్యాప్తును పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, న్యాయస్థానాల్లో కేసుల పురోగతికి అవసరమైన చర్యలను సకాలంలో చేపట్టాలని సూచించారు.

**సిబ్బంది సమస్యలపై ఆరా**

అనంతరం పోలీస్ సిబ్బంది కిట్‌ను డీఐజీ పరిశీలించారు. విధుల నిర్వహణలో సిబ్బందికి ఎదురవుతున్న ఇబ్బందులు, శాఖాపరమైన అవసరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించేలా అవసరమైన సహకారం అందించాలని అధికారులకు సూచించారు.

**మహిళల భద్రతకు ప్రాధాన్యం**

మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని డీఐజీ ఆదేశించారు. మహిళలపై నేరాల విషయంలో ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా స్పందించాలని సూచించారు. ప్రజల్లో పోలీసులపై నమ్మకం పెరిగేలా విధులు నిర్వహించాలని, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగించాలని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



**మొక్కలు నాటిన డీఐజీ**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా సర్కిల్ కార్యాలయ ఆవరణలో పోలీస్ అధికారులతో కలిసి డీఐజీ మొక్కలు నాటారు. పోలీస్ కార్యాలయాలు, స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్క సంతకం కోసం మూడు నెలల నిరీక్షణ!

## పంచాయతీ కార్యాలయం చుట్టూ కాంట్రాక్టర్ ప్రదక్షిణలు

## పనులు పూర్తయినా ప్రక్రియకు బ్రేక్ రాజకీయ విభేదాల ప్రభావమేనా..?

## అభివృద్ధి పనులకు పరిపాలనా జాప్యం అడ్డంకిగా మారిందా..?

## అధికారుల జోక్యం కోసం ఎదురుచూపులు

**ఆసిఫాబాద్ ఆర్సీ, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):**వాంకిడి: గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత వాటికి సంబంధించిన పరిపాలనా ప్రక్రియ ముందుకు సాగాల్సి ఉండగా, ఒక సంతకం వద్దే వ్యవహారం నిలిచిపోయిందని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ సంతకం కోసం గత మూడు నెలలుగా గ్రామపంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. ఒక చిన్న ప్రక్రియ కోసం ఇంతకాలం వేచి ఉండాల్సిన పరిస్థితి తనకు తీవ్ర మానసిక, ఆర్థిక ఇబ్బందులను కలిగిస్తోందని పేర్కొన్నారు. తాను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పంచాయతీ స్థాయిలో పూర్తి చేయాల్సిన ప్రక్రియలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకాలు పూర్తయ్యాయని, అయితే ఉప సర్పంచ్ సంతకం మాత్రం పెండింగ్‌లో ఉందని అనిల్ తెలిపారు. సంతకం పూర్తికాకపోవడంతో సంబంధిత ప్రక్రియ ముందుకు సాగడం లేదని చెప్పారు. సమస్యను పరిష్కరించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు జిల్లా అధికారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

**రోజులు కాదు.. నెలలు గడిచినా పరిష్కారం లేదు**

ఒకటి రెండు రోజుల వ్యవహారం కాదని, సుమారు మూడు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని అనిల్ తెలిపారు. సమస్య పరిష్కారం అవుతుందనే ఆశతో పంచాయతీ కార్యాలయానికి వెళ్లి సంబంధిత వారిని కలుస్తూ వస్తున్నానని చెప్పారు. ప్రతిసారి త్వరలో సమస్య పరిష్కారమవుతుందని భావించినా, రోజులు గడిచే కొద్దీ పరిస్థితి మరింత జాప్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరగడం వల్ల తన సమయం, శ్రమ వృథా అవుతున్నాయని, మరోవైపు పనులకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాలు కూడా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. తాను చేసిన పనులకు సంబంధించి నిబంధనల ప్రకారం అవసరమైన ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ఒక సంతకం వద్దే వ్యవహారం నిలిచిపోవడం తనకు అర్థం కావడం లేదన్నారు.

**నీకేం నేను అన్యాయం చేశాను**

తనపై ఎందుకు ఇంతటి కఠిన వైఖరి అవలంబిస్తున్నారో అర్థం కావడం లేదని అనిల్ ప్రశ్నించారు. “చంపేస్తే ఒకేసారి చంపేయ్.. మానసిక క్షోభకు గురిచేయకు. మరి ఇంతలా టార్చర్ చేస్తావా.. నీకేం నేను అన్యాయం చేశాను” అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. తనపై వ్యక్తిగతంగా ఎలాంటి కక్ష పెట్టుకోవాల్సిన అవసరం లేదని, తాను ఎవరికి అన్యాయం చేయలేదని పేర్కొన్నారు. తనకు రాజకీయంగా ఎవరితోనూ వ్యక్తిగత పోటీ లేదని, గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడమే తన ఉద్దేశమని తెలిపారు. రాజకీయ విభేదాలు ఉంటే వాటిని రాజకీయంగానే పరిష్కరించుకోవాలని, వాటి ప్రభావం అభివృద్ధి పనులపై పడకూడదని కోరారు.

**ఎన్నికల నాటి రాజకీయ సమీకరణాలే కారణమా..?**

గత సర్పంచ్ ఎన్నికల సమయంలో ఏర్పడిన రాజకీయ పరిస్థితులు, అప్పటి సమీకరణాల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోందని అనిల్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఏర్పడిన విభేదాల కారణంగానే తనపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అప్పటి రాజకీయ పరిస్థితులను ఇప్పటికీ కొనసాగించడం వల్ల తన పనులకు సంబంధించిన ప్రక్రియలో జాప్యం జరుగుతోందని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ఉప సర్పంచ్ వైపు నుంచి అధికారిక వివరణ రావాల్సి ఉంది. సంతకం ఎందుకు పెండింగ్‌లో ఉంది, దానికి సంబంధించిన కారణాలు ఏమిటి అనే అంశంపై సంబంధిత అధికారులు కూడా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**అభివృద్ధి పనులకు రాజకీయాలు అడ్డుకావొద్దు**

గ్రామపంచాయతీ పరిధిలో ప్రజల అవసరాల కోసం చేపట్టే అభివృద్ధి పనులకు రాజకీయ విభేదాలు అడ్డంకిగా మారకూడదని అనిల్ కోరారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజా సమస్యలు, గ్రామ అభివృద్ధి అంశాలపై అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో రహదారులు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, మౌలిక వసతులు వంటి పనులు ప్రజల అవసరాలకు సంబంధించినవని, వాటికి రాజకీయ రంగు పులమకూడదని అన్నారు. ఎవరి మధ్య వ్యక్తిగత లేదా రాజకీయ విభేదాలు ఉన్నా వాటి ప్రభావం పంచాయతీ పరిపాలనపై పడకుండా అధికారులు పర్యవేక్షించాలని కోరారు.

**పనుల నాణ్యతపై వార్డు సభ్యురాలి స్పందన**

వాంకిడి గ్రామపంచాయతీ 11వ వార్డు సభ్యురాలు నాగోసే తానుబాయి మాట్లాడుతూ.. కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ చేపట్టిన పనులు నాణ్యంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టారని, పనుల విషయంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రక్రియలో అనవసరమైన జాప్యం చోటుచేసుకుంటే దాని ప్రభావం చివరకు ప్రజలపైనే పడే అవకాశం ఉందన్నారు. ఉప సర్పంచ్ సంతకం విషయంలో జాప్యం కారణంగా పనులకు సంబంధించిన ప్రక్రియ నిలిచిపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**అసలు ప్రక్రియ ఎక్కడ నిలిచిపోయింది..?**

ప్రస్తుతం ప్రధానంగా పలు ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కాంట్రాక్టర్‌కు సంబంధించిన పనుల పత్రాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా..? సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సంతకాలు పూర్తయితే ఉప సర్పంచ్ సంతకం ఎందుకు పెండింగ్‌లో ఉంది..? సంతకం చేయకుండా ఉండటానికి ఏదైనా పరిపాలనా కారణం ఉందా..? లేక ఇతర కారణాలతో ప్రక్రియ నిలిచిపోయిందా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. మూడు నెలలుగా సమస్య కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. పంచాయతీకి సంబంధించిన ప్రతి ప్రక్రియ నిబంధనల ప్రకారం సాగుతోందా లేదా అన్నది పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంటున్నారు.

**పరిపాలనలో పారదర్శకతపై ప్రశ్నలు**

గ్రామపంచాయతీలో ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన పనులు ఆలస్యమైతే వాటిపై ప్రజల్లో అనుమానాలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందువల్ల ఏదైనా ప్రక్రియ పెండింగ్‌లో ఉంటే దానికి కారణాలను సంబంధిత వ్యక్తులకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.ఒకవేళ పత్రాల్లో లోపాలు ఉంటే వాటిని స్పష్టంగా తెలియజేసి సరిదిద్దుకునే అవకాశం కల్పించాలి. నిబంధనల పరంగా ఎలాంటి అభ్యంతరం లేకపోతే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంలో వాస్తవ పరిస్థితులు ఏమిటన్నది అధికారుల పరిశీలనతోనే స్పష్టమయ్యే అవకాశం ఉంది.

**కాంట్రాక్టర్‌కు ఆర్థిక భారం**

మూడు నెలలుగా ప్రక్రియ నిలిచిపోవడంతో తనకు ఆర్థికంగా కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని అనిల్ తెలిపారు. పనులు పూర్తి



చేసిన తర్వాత సంబంధిత పంచాయతీ ప్రక్రియను పూర్తి చేసి తదుపరి దశకు వెళ్లాల్సి ఉండగా, సంతకం జాప్యం కారణంగా వ్యవహారం ముందుకు సాగడం లేదన్నారు. తాను చేపట్టిన పనుల విషయంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చానని, ప్రజలకు ఉపయోగపడేలా పనులు పూర్తి చేశానని తెలిపారు. తనకు రావాల్సిన ప్రక్రియ ముందుకు సాగకపోవడం వల్ల వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని పేర్కొన్నారు.

**కలెక్టర్ జోక్యం కోరుతున్న అనిల్**

మూడు నెలలుగా సమస్య పరిష్కారం కాకపోవడంతో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తనకు న్యాయం చేయాలని కాంట్రాక్టర్ మండోకర్ అనిల్ విజ్ఞప్తి చేశారు. తనకు ఎదురవుతున్న సమస్యపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని కోరారు. పంచాయతీ రికార్డులను పరిశీలించి, సంతకం ఎందుకు పెండింగ్‌లో ఉందో గుర్తించాలని, నిబంధనలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు సంబంధించిన వ్యవహారాల్లో రాజకీయ విభేదాలకు తావులేకుండా ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

**స్పందన కోసం ఎదురుచూపులు**

కాంట్రాక్టర్ చేసిన ఆరోపణలపై ఉప సర్పంచ్ నుంచి ఎలాంటి వివరణ వెలువడుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మరోవైపు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న సంతకం వ్యవహారంపై పంచాయతీ అధికారులు ఏ విధంగా స్పందిస్తారన్నది కూడా ప్రశ్నార్థకంగా ఉంది. సంతకం జాప్యానికి అసలు కారణం ఏమిటి..? రాజకీయ విభేదాలే కారణమా..? లేక పంచాయతీ నిబంధనలకు సంబంధించిన ఇతర అంశాలున్నాయా..? అనే విషయాలు అధికారుల విచారణతో తేలాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై దృష్టి సారించి వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే సమస్యకు స్పష్టత వచ్చే అవకాశం ఉందని కాంట్రాక్టర్ అనిల్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలుగా కొనసాగుతున్న ఈ వ్యవహారానికి ముగింపు ఎప్పుడు..? పంచాయతీ పరిపాలనా ప్రక్రియ ఎప్పుడు ముందుకు సాగుతుంది..? అధికారుల జోక్యంతో సమస్యకు పరిష్కారం లభిస్తుందా..? అనేది వేచి చూడాల్సి ఉంది.

# కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా ఆసిఫాబాద్ లో అకస్మిక పర్యటనలో భాగంగా

**ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్,వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాల సందర్శన పోలీస్ స్టేషన్ లలో వివిధ విభాగాల రికార్డులు, కేసుల దర్యాప్తుల పరోగతి పరిశీలన:**

**పుష్పగుచ్చం అందించి డిఐజీ అంబర్ కిషోర్ జా కు స్వాగతం పలికిన ఎస్పీ నీతిక పంత్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా:**

**శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ, మహిళల భద్రత, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి-డీఐజీ అంబర్ కిషోర్ ఝా:**

**అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన డీఐజీ అంబర్ కిషోర్ ఝా:**

**సెప్టెంబర్19,సిర్పూర్-టి కాన్స్టెన్సీ రెస్పాండెంట్ ప్రజాజ్యోతి, కబీర్ అహ్మద్:** కాళేశ్వరం జోన్-1డీఐజీ అంబర్ కిషోర్ జా శనివారం ఆసిఫాబాద్ అకస్మిక పర్యటనకు వచ్చిన జిల్లాకు వచ్చిన పట్టణ పోలీస్ స్టేషన్ తో పాటు వాంకిడి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయా న్ని సందర్శించి ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు,కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణ మహిళ భద్రత ట్రాఫిక్ నిర్వహణ ప్రత్యేక దృష్టి సారించాలని సూచన జిల్లా ఎస్పీ నితికా పంత్, పుష్పగుచ్ఛం అందించి డీఐజీకి స్వాగతం పలికారు. అనంతరం డీఐజీ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ అధికారులతో కలిసి సర్కిల్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు..పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం జోన్-1 డీఐజీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.... కార్యాలయాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని అధికారులకు సూచించారు. వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచడంతో పాటు,వాటికి సంబంధించిన వివరాలను పక్కాగా నమోదు చేయలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, రికార్డులు,ఫైళ్లు, పత్రాలను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం సర్కిల్ పరిధిలో నమోదైన తీవ్రమైన నేరాల కేసులు,దర్యాప్తులో ఉన్న కేసుల సీడీ ఫైళు





,,పెండింగ్‌లో ఉన్న విచారణ కేసులకు సంబంధించిన ఫైళ్లను డీఐజీ పరిశీలించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పురోగతి, కేసుల ప్రస్తుత స్థితి, నిందితుల అరెస్టులు,పెండింగ్‌లో ఉన్న కేసులు,కేసులు పెండింగ్‌లో ఉండటానికి గల కారణాలను సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది కిట్‌ను పరిశీలించి,వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు కేసుల దర్యాప్తులో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని, నేరాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి,అన్ని ఆధారాలను సేకరించాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, న్యాయస్థానా ల్లో కేసుల పురోగతికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని,నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డీఐజీ సూచించారు. మహిళలు,బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పోలీస్ అధికారులు, సిబ్బంది పనిచేయాలని డీఐజీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చీలపల్లిలో వారం రోజుల్లో రెండు వాగు లపై కల్వర్టుల పనులు ప్రారంభిస్తాం







**కల్వట్ల సందర్శనానికి వచ్చిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విట్టల్ కు ప్రజల నిరసన సెగలు**


**కల్వర్టులు కాదు బ్రిడ్జి వంతనాలు నిర్మించి శాశ్వత పరిష్కారం చేయలి గ్రామస్తుల డిమాండ్:**

**సెప్టెంబర్19,సిర్పూర్-టి కానిస్టేన్సి కరస్పాండెంట్ ప్రజాజ్యోతి, కబీర్ అహ్మద్:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం లోని చీలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 8 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీరనుందని రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కలెక్టర్ ద్వారా కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని కల్వట్ల పరిశీలనకు వెళ్లిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండేవిటల్ కు ప్రజల నిరసన సెగ, మారుమూల గిరిజన గ్రామమైన చీలపల్లికి వెళ్లే రహదారిశ్రీ అస్త వ్యస్తంగా మారి అక్కడి 2 వాగుల కన్వర్ట్ లు శిథిలమై రాకపోకలకు అంతరాయం ఏర్పడడం గర్భిణి స్త్రీలకు ,చిన్న పిల్లల తల్లులకు వృద్ధులకు అత్యవసర పరిస్థితుల్లో అంబు లెన్సులు,వాహనాలు రాక రాకపోకలకు అంతరాయం అక్కడి 8 గ్రామాల ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవడంతో వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని చిల్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 8 గ్రామాల ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు 2 వాగులకు కల్వట్లు నిర్మిస్తామని నిర్మాణానికి గ్రామ ప్రజలు సహకరించాలని సూచించారు. అటవీశాఖ అనుమతుల కారణంగా కొంత సమయం పాటు అవకాశం ఉందన్నారు అప్పటివరకు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారం రోజుల్లో 2 కల్వర్టుల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండేవిట్టర్ శిథిలమైన కల్వర్టులను సందర్శించడంతో భారీ సంఖ్యలో ప్రజలు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. దండే విట్టల్ కు నిరసన సెగలు ఎదురయ్యాయి గ్రామస్తులు, మాట్లాడుతూ... కల్వర్టు వద్దని కల్వర్టు ఆగడం లేదని,శాశ్వత పరిష్కారం కావాలని పట్టుపట్టారు. బ్రిడ్జి వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. శాశ్వతంగా వంతనాలు నిర్మించాలని ప్రజలు పట్టుపట్టారు. పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్సీ దండేవిటల్ చుట్టుముట్టి నిరసన చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతానని ఎమ్మెల్సీ దండేవిటల్ అన్నారు.

# బీజేపీ ఎస్టీ మోర్చా మంచిర్యాల జిల్లా నూతన కమిటీ

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు బీజేపీ ఎస్టీ మోర్చా మంచిర్యాల జిల్లా నూతన కమిటీని శనివారం ప్రకటించారు. జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు పిమ్మ సింగ్ రాథోడ్ సంతకంతో నియామక ఉత్తర్వులు జారీ చేశారు. నూతన నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. నూతన జిల్లా కమిటీలో బద్ది బాలరాజ్ (కాసిపేట్), గుగులోత్ ఇందల్ నాయక్ (మంచిర్యాల), భూక్య యశ్వంత్ రావు (దండేపల్లి), బానోత్ శంకర్ (దండేపల్లి) ఉపాధ్యక్షులుగా నియమితుల య్యారు. బోద సత్యనారాయణ (దండేపల్లి), కున్సోత్ సంతోషి రామ్ (మందమర్రి), బోద నర్సింగ్ నాయక్ (దండేపల్లి) ప్రధాన కార్యదర్శులుగా నియమితులయ్యారు. కున్స లక్ష్మయ్య (వేమనపల్లి), కొడప మహేష్ (హాజీపూర్), కొడప మహేష్ (కోటపల్లి), గుగులోత్ భీమా నాయక్ (హాజీపూర్) కార్యదర్శులుగా, రాథోడ్ నరేందర్ (లక్సెట్టిపేట్) కోశాధికారిగా నియమితులయ్యారు. పేంద్రం రాజ్ కుమార్ (హాజీపూర్) మీడియా కన్వీనర్‌గా, ధారావత్ నితిన్ నాయక్ (భీమారం) మీడియా కో-కన్వీనర్‌గా, అడ్డెపల్లి సతీష్ (నెన్నెల్) సోషల్ మీడియా కన్వీనర్‌గా, ధారావత్ అనిల్ నాయక్ (భీమారం) సోషల్ మీడియా కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే లావాత్ రవీందర్ (లక్సెట్టిపేట్) మన్ కీ బాత్ కన్వీనర్‌గా, కొడిపె మహేందర్ (నెన్నెల్) ఐటీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా లిబావోని అనిత (కాసిపేట్), బోద మంజుల (దండేపల్లి), మోహిసోని రాజేందర్ (మందమర్రి), సారా సత్యం (హాజీపూర్), బోద పున్నం (దండేపల్లి)లిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ఎస్టీ మోర్చాను మరింత బలోపేతం చేయాలని నాయకులు సూచించారు. విద్య, ఉపాధి, భూమి, తాగునీరు, సంక్షేమం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రజల తరఫున పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతన కమిటీ సభ్యులకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు పిమ్మ సింగ్ రాథోడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు




భారతీయ జనతా పార్టీ
BHARATIYA JANATA PARTY
మంచిర్యాల జిల్లా
MANCHERIAL DIST


# సింగరేణిలో జేబీసీసీఐ సంఘాలకు సమాన హోదా కల్పించాలి

## 2025-26 ఆర్థిక సంవత్సర లాభాల్లో 40 శాతం వాటాను వెంటనే చెల్లించాలి

## డైరెక్టర్ (ఫా) గౌతమ్ పొట్రుకు ఎస్‌సీఎంకేఎస్ (బీఎంఎస్) ప్రతినిధుల వినతి

**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు పొందిన కార్మిక సంఘం పదవీకాలం ముగిసిన నేపథ్యంలో కొత్తగా ఎన్నికలు జరిగేంత వరకు జేబీసీసీఐ అనుబంధ కార్మిక సంఘాలకు సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం (ఎస్‌సీఎంకేఎస్--బీఎంఎస్) డిమాండ్ చేసింది. అలాగే సింగరేణికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో కార్మికులకు చెల్లించాల్సిన 40 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించి చెల్లించాలని కోరారు. ఈ మేరకు ఎస్‌సీఎంకేఎస్ (బీఎంఎస్) ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్) గౌతమ్ పొట్రును ఆయన కార్యాలయంలో కలిసి మెమోరాండం సమర్పించింది సింగరేణిలో గుర్తింపు పొందిన కార్మిక సంఘం పదవీకాలం ముగిసినందున, కొత్త గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగే వరకు జేబీసీసీఐలో ప్రాతినిధ్యం వహిస్తున్న అన్ని కార్మిక సంఘాలను సమానంగా చూడాలని ప్రతినిధులు కోరారు. ప్రస్తుతం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం వివిధ కార్మిక సంఘాలతో చర్చలు జరుపుతున్న నేపథ్యంలో, గుర్తింపు సంఘం పదవీకాలం ముగిసిన తర్వాత ఏదైనా ఒక సంఘానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. జేబీసీసీఐ అనుబంధ సంఘాలను చర్చలు, సమావేశాలు, సంప్రదింపులు, కార్మిక సమస్యలకు సంబంధించిన ఇతర అధికారిక కార్యక్రమాలకు సమానంగా ఆహ్వానించి, కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు సమాన అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సింగరేణి 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన లాభాల్లో కార్మికులకు రావాల్సిన 40 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించి, ఎలాంటి జాప్యం లేకుండా చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి లాభాల్లో కార్మికుల శ్రమ, కృషి కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి రావాల్సిన లాభాల వాటాను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. జేబీసీసీఐ అనుబంధ కార్మిక సంఘాలకు సమాన హోదా, సమాన అవకాశాలు కల్పించడంతో పాటు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 40 శాతం లాభాల వాటాను వెంటనే ప్రకటించి కార్మికులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది. ఈ అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని మనవి చేశారు .ఈ కార్యక్రమంలో ఎస్‌సీఎంకేఎస్ (బీఎంఎస్) అధ్యక్షుడు అప్పని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.




కార్మిక సంక్షేమం
SINGARENI COAL MINES KARMIKA SANGH
Regd. No. E-121 (Affiliated to ABKMS-BMS)
Central Office : Qr. No. D-565, Gandhinagar, Chowrastha Main Road, GODAVARIKHANI-505 209, Dist : Peddapalli, T.S.

President
APPANI SRINIVAS
Cell: 9848950932
email: appani.srinivas33@gmail.com

General Secretary
VADDEPALLI KUMARASWMAY
Cell: 9573872845
email: vaddepallikumaraswmay@gmail.com

Ref. No. : SCMKS/ABKMS/BMS/ Date 19-09-2026

To
The Chairman & Managing Director,
Singareni Collieries Company Limited,
Singareni Bhavan, Hyderabad.

Subject: Request to accord equal status to JBCCI affiliated Trade Unions in Singareni Collieries and immediate declaration and payment of 40% profit share for the financial year 2026 – Reg.

Respected Sir,

In view of the expiry of the term of the Recognised Trade Union in Singareni Collieries, it is necessary to provide equal status and equal opportunities to Trade Unions representing JBCCI until the elections for a new Recognised Trade Union are conducted.

At present, the Management is holding discussions with various Trade Unions for the resolution of workers' issues. Therefore, after the expiry of the term of the Recognised Trade Union, it would not be appropriate to give any special preference to one particular union. JBCCI-represented Trade Unions should be provided with an equal role and opportunity to raise workers' issues before the Management and work towards their resolution.

Therefore, we request the Management to invite JBCCI-represented Trade Unions equally for discussions, meetings, consultations and other official engagements relating to workers' issues, and accord them equal status and opportunities.

Further, we request the Management to immediately declare the 40% profit share payable to the workers for the financial year 2026 and take necessary steps for its payment without any delay. Since the hard work and contribution of the workers play a vital role in the profits earned by Singareni Collieries, ensuring timely payment of the profit share due to them is fair and justified.

Hence, we request the Management to respond positively to the above two issues and take appropriate action to:

1. Grant equal status and equal opportunities to JBCCI-represented Trade Unions; and
2. Immediately declare and pay the 40% profit share for the financial year 2026 to the workers.

We request the Management to take a fair and appropriate decision on the above matters in the interest of the workers.

Thanking you,

Yours sincerely
(VADDEPALLI KUMARASWAMY)
General Secretary
Singareni Coal Mines Karmika Sangh

Copy to:
1. The Deputy CLC(C), Hyderabad – for necessary action.
2. The Director (PA&W), SCCL, Hyderabad.

## గణేష్ మండపాలను సందర్శించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ

### నిమజ్జన ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష



**మంచిర్యాల, 19, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**బెల్లంపల్లి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ శనివారం పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల నిర్వాహకులతో మాట్లాడి గణేష్ నిమజ్జన కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మండపాల వద్ద శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిమజ్జనం రోజున ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూను ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ ఇన్‌స్పెక్టర్ హనోక్, బెల్లంపల్లి పట్టణ పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హజ్రత్ ఇబ్రహీం ధంస ఉర్స్ షరీఫ్ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, సందర్శన





**నిర్మల్ టౌన్ : సెప్టెంబర్ 19 ( ప్రజాజ్యోతి )** నిర్మల్‌లోని శరత్ మహల్ ప్రాంతంలోని మస్జిద్-ఎ-ఖుబా వద్ద నిర్వహించిన పవిత్ర సందల్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు ఎస్పీని శాలువాతో ఘనంగా సత్కరించారు.సందల్ వేడుకలు మత సామరస్యానికి, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని ఎస్పీ పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలందరూ ప్రశాంతంగా, సోదరభావంతో వేడుకలను నిర్వహించుకోవాలని కోరారు.ఈ ప్రార్థనల్లో డీఎస్పీ పి. శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, గోవర్ధన్, ఎస్ఐలు గణేష్, శ్రీకాంత్, లింబాద్రి, గోపీ, ఆర్ఎస్ఐ రవి కుమార్, మసీదు కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ఆటో బ్యాటరీల చోరీ -నిందితుడు అరెస్ట్ మరొకరు పరారీ

**జన్నారం,సెప్టెంబర్19(ప్రజాజ్యోతి)** జన్నారం మండల కేంద్రంలో రెండు ఆటోల బ్యాటరీలు చోరీ చేసిన కేసులో ఒక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ ఎల్మపల్లి నరేశ్ (38) తన ఆటో నెం. ఇూ 1ఆ 7765 ను ఈ నెల 16వ తేదీన ఇంటి బయట పార్క్ చేశాడు. అతని పక్కనే నివాసం ఉండే సంబరాజుల రాజశేఖర్ కు చెందిన ఆటో టూ 19బ 4353 కూడా అక్కడే పార్క్ చేసి ఉంది. మరుసటి రోజు 17వ తేదీ ఉదయం 6 గంటలకు చూడగా రెండు ఆటోలలోని బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. వాటి విలువ సుమారు రూ.10,000 ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, చోరీ చేసిన బ్యాటరీలను అమ్ముతుండగా ధర్మారం గ్రామానికి చెందిన గడ్డి చంద్రశేఖర్ ం/శీ మల్లయ్య (22), వృత్తి సెంట్రింగ్ పనిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి



రెండు ఎక్సైడ్ కంపెనీ బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు.జల్సాల కోసమే ఈ చోరీకి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ కేసులో మరో నిందితుడైన వినాయక్ నగర్, జన్నారంకు చెందిన ఎరుకల అరుణ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు కొనసాగుతోందని ఎస్.ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. నిందితుడు గడ్డి చంద్రశేఖర్ ను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

# నిమజ్జన ఉత్సవాల్లో డీజే కు అనుమతి లేదు... తాండూర్ సీఐ దేవయ్య...

## పోలీస్ సూచనలు తప్పకుండా పాటించాలి

**తాండూరు సెప్టెంబర్ 19 ప్రజాజ్యోతి** గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు నిర్వహించే శోభాయాత్రలో నిషేధిత డీజే కు ఎలాంటి అనుమతులు లేవని తాండూర్ సీఐ దేవయ్య అన్నారు ఈ డీజే శబ్ద కాలుష్యం వల్ల ప్రతి ఒక్కరికి చాలా ఇబ్బందులు ఎదురవుతాయని ముందస్తుగా డీజే నిర్వహించకుండా ఉండేందుకు యజమానులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు బైండోవర్ కూడా చేయించడం జరిగిందన్నారు. సాంప్రదాయ భక్తి భజన పాటలతో ఊరేగింపు చేసుకోవాలని నిమజ్జన ప్రదేశాలను గుర్తించిన చోటే వేయాలని చెరువుల వద్దకు చిన్న పిల్లలను వెంట తీసుకువెళ్లద్దన్నారు .ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ వారి సూచనలు పాటిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎస్సై ప్రసాద్ రావు, మాదారం ఎస్సై సౌజన్యతో పాటు సిబ్బంది మత పెద్దలు, మండపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్రి--పరండోలి బీటీ రోడ్డు నిర్మించాలి

## సచిన్ సావంత్‌కు పరండోలి సర్పంచ్ రాథోడ్ పుష్పలత వినతి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 19 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి పరండోలి గ్రామపంచాయతీ పరిధిలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఓమ్రి నుంచి పరండోలి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ పరండోలి సర్పంచ్ రాథోడ్ పుష్పలత ఏఐసీసీ చైర్మన్ సచిన్ సావంత్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఆసిఫాబాద్ నియోజకవర్గం లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమా నికి సర్పంచ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన సమస్యలను సచిన్ సావంత్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఎన్నాళ్లుగానో పెండింగ్‌లో..**

ఓమ్రి నుంచి పరండోలి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో గ్రామస్థులు రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోందని పేర్కొన్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో ప్రజలు ఆస్పత్రులకు చేరేందుకు రహదారి సౌకర్యం ఎంతో కీలకమని వివరించారు.

**సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి**



గ్రామ ప్రజల దీర్ఘకాలిక సమస్యగా ఉన్న ఓమ్రి--పరండోలి బీటీ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టేలా సహకరించాలని సచిన్ సావంత్‌ను రాథోడ్ పుష్పలత కోరారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పరండోలి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

# పొన్కల్ ఉన్నత పాఠశాలలో ఘనంగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్



**మామడ సెప్టెంబర్ 20 ( ప్రజా జ్యోతి )** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పొన్కల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం తల్లిదండ్రుల--ఉపాధ్యాయుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైస అరవింద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, విజ్ఞానం పెంపొందించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని సూచించారు. చదువుతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా, సృజనాత్మక నైపుణ్యాలను వెలికితీయడానికి పాఠశాల వేదికగా నిలుస్తుందని తెలిపారు.తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్న ప్రధానోపాధ్యాయులు, పాఠశాలలో అందుతున్న బోధన, వాతావరణం, మధ్యాహ్న భోజనంపై వారి సూచనలు స్వీకరించారు. తల్లిదండ్రులు పాఠశాల విద్యా వాతావరణం, బోధన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే విద్యార్థులు ఉపన్యాసాలు, పాటలతో ఆకట్టుకున్నారు. యన్ యం యం ఎస్, ఎన్ సి సితో పాటు వివిధ స్కాలర్‌షిప్‌లు, విద్యా అవకాశాలపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ నగర్ లో లక్ష్మీ గణపతి 250 టిక్కెట్టు డ్రా టికెట్టు కట్టు స్కూటీ పట్టు



**ఖానాపూర్ సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి )** ప్రతి ఏటా గణపతి ఉత్సవాల్లో నానా రకాల గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసి పోటాను పోటీగా నిమజ్జనం చేయడమే కాకుండా రకరకాల ప్రత్యేక పూజలు అన్నదానాలు నిర్వహించడం జరుగుతుంది అయితే నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాం నగర్ లో మొట్ట మొదటి గణపతి నంబర్ వన్ గణపతి ఈ ఏడు లక్ష్మీ గణపతి నిలబెట్టింది అయితే అత్యంత భక్తి శ్రద్ధలతో పూజానంతరం లడ్డూల లక్కీ డ్రా చేయడం, లేదా వేలం పాట పాడడం ఆనవాయితీ కాగా దీనికి భిన్నంగా దేనికి అదే అన్నట్లు శ్రీరామ్నగర్ యూత్ విగ్నేశ్వరుని దర్శనం చేసుకున్న వ్యక్తులు 250 రూపాయలు లక్కీలో కట్టు (చెల్లించి రసీదు పొంది) స్కూటర్ పట్టు (కెళ్ళండి) అన్నట్లు గణేష్ విగ్రహం ముందర స్కూటీనే మొట్ట మొదటిగా కొనిపెట్టారు అయితే భక్తులు విచ్చేసిన సందర్భంగా టికెట్టు తీసుకొని తన అదృష్టమే కాకుండా ఈ స్కూటీ వెళితే తమ భవిష్యత్తుకే బాటలు అవుతాయని ప్రత్యేక మొక్కులతో ఆయా భక్తులు ఈ స్కూటీకి 250 రూపాయలు చెల్లించి వినాయకుని ఆశీర్వాదంతో పాటు అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు వినాయకుని ఆశీర్వాదంతో పాటు అదృష్టవంతులు ఎవరో వేచి చూడాల్సిందే.

## అంకోలిలో ఘనంగా ప్రీ-ప్రైమరీ తరగతుల ను ప్రారంభించిన సర్పంచ్ మడావి కిషన్..



ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 19 ( ప్రజా జ్యోతి ) ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో, ప్రభుత్వం అందించిన అన్ని ఆధునిక వసతులతో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ–ప్రైమరీ తరగతులను సర్పంచ్ మడావి కిషన్ ఉపాధ్యాయులతో కలిసి శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారికి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించేందుకు ఈ తరగతులు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ పాటిల్, ఉపాధ్యాయురాలు బంతిపల్లి కావ్య, ఉపసర్పంచ్ దత్తు, పోషకులు చంద్రశేఖర్, కాంత్ రెడ్డి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**9, 11వ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి**

**సెప్టెంబర్ 30 వరకు అవకాశం**



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 19 ,( ప్రజాజ్యోతి ).సిర్పూర్ కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం 9వ, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పాలన విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 9వ తరగతిలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంపిక పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలి. అదేవిధంగా 11వ తరగతి ప్రవేశాల కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. 9వ, 11వ తరగతుల్లో ప్రవేశాల కోసం 2027 ఏప్రిల్ 10న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా పాలన విభాగం వెల్లడించింది. విద్యార్థులు గడువులోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసి, పరీక్షకు సిద్ధం కావాలని సూచించారు. ప్రవేశాలకు సంబంధించిన అర్హతలు, పరీక్ష విధానం, ఇతర వివరాలను సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని అధికారులు తెలిపారు.

## ఖానాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ పూర్తి కార్యవర్గం ప్రకటించిన అధ్యక్షులు గొర్రె గంగాధర్


VEDMA BHOJJU
DISTRICT CONGRESS COMMITTEE-NIRMAL
Khanapur Town Congress Committee

ఖానాపూర్ సెప్టెంబర్ 19( ప్రజా జ్యోతి ) నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గాలు ఇటీవల మండల పట్టణ గ్రామ అధ్యక్షులను జిల్లా పార్టీ అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ప్రకటించారు జిల్లాలోని అన్ని మండల పట్టణ గ్రామ కార్యవర్గాలను పూర్తి స్థాయిలో ప్రకటించినట్లు ఖానాపూర్ పట్టణ అధ్యక్షులు గొర్రె గంగాధర్ తెలిపారు ఈమేరకు పట్టణ ఉపాధ్యక్షులుగా పిచ్చుక నవీన్,మహమ్మద్ ముషీర్ శ్రీపాద శేషాద్రి ప్రధాన కార్యదర్శులుగా వేల్పుల కమల్ రాజ్ మద్దెల రామకృష్ణ లోకిని మహేందర్లు కార్యదర్శులుగా ఎల్ల రాజేందర్ మగ్గిడి సురేష్ సయ్యద్ అయూబ్ దుర్గం సంతోష్ మొలుగూరి సురేష్ లు కార్యవర్గ సభ్యులుగా షారుక్ ఖాన్ దాత్రిక రాము మద్దె ల లక్ష్మణ్ ఎంఎ నయంలను ప్రకటించినట్లు పట్టణ అధ్యక్షులు గొర్రెగంగాధర్ ప్రకటనలో తెలిపారు

## నిర్మల్‌లో యువతకు ఉచిత పోలీస్ ఉద్యోగ శిక్షణ

**ఈ నెల 28 నుంచి తరగతులు ప్రారంభం**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సహకారంతో నిర్వహణ**

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



నిర్మల్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 19 ,( ప్రజాజ్యోతి ). పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సహకారంతో ఉచిత ప్రీ రిక్రూట్‌మెంట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు. ఈ నెల 28వ తేదీ సోమవారం నుంచి నిర్మల్‌లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన వివిధ సబ్జెక్టులపై శిక్షణ, పరీక్షల విధానంపై అవగాహనతో పాటు అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఆసక్తి గల అభ్యర్థులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను సంప్రదించి బయోడేటాను సమర్పించి శిక్షణలో అడ్మిషన్ పొందాలని ఎస్పీ సూచించారు. శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సిద్ధమవుతున్న నిర్మల్ జిల్లా యువత ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో శిక్షణ పొంది పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు.

## ఇస్పూర్‌లో ఉచిత వైద్య శిబిరం



నేరడిగొండ, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):మండల పరిధిలోని ఇస్పూర్ సబ్‌సెంటర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జాదవ్ లలితా రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్ ఎ. సంతోష్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఎ. సంతోష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తీవ్రమైన జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం






నిర్మల్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 19 ,( ప్రజాజ్యోతి ). స్వచ్ఛతా హి సేవా ప్రచారంలో భాగంగా విబిజి రామ్ జి, సెర్ప్ సిబ్బందితో జిల్లా గ్రామీణ స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అవగాహన సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ, చెత్తను వివిధ పద్ధతుల్లో వేరు చేయడం, తగ్గించడం, పునర్వినియోగం, పునరుత్పత్తి పద్ధతులను ప్రోత్సహించడం పై కూలంకషంగా వివరించారు. వ్యర్థాల నుండి సంపద సృష్టించే విధానాలు, పరిశుభ్రత, పారిశుధ్యం, చెత్త నిర్వహణ పద్ధతులపై సిబ్బందికి స్పష్టమైన అవగాహన కల్పించారు. గ్రామాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా వికసించా లంటే సమాజ భాగస్వామ్యం ఎంతో అవసరమని, పర్యావరణ హిత స్థిరమైన జీవన పద్ధతులను పెంపొందించుకోవాలని వివరించారు. అనంతరం అందరూ స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభి వృద్ధి సంస్థ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నో బ్యాగ్ డేలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన





**ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధనకు కృషి చేయాలి**

**ప్రముఖ వక్త లింగంపల్లి సుభాష్**

**సారంగాపూర్, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి** కౌట్ల బి పాఠశాలలో నో బ్యాగ్ డే--పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల భారం లేకుండా వివిధ విద్యా, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించి, వారి ప్రతిభను వెలికితీసేలా అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యం, సబ్జెక్టులపై పట్టు, పాఠశాలలో వారి ప్రవర్తన తదితర అంశాలపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 'బ్యాగ్ లెస్ డే' సందర్భంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆచరణాత్మక జ్ఞానం, సామాజిక నైపుణ్యాలను పెంపొందించేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వక్త లింగంపల్లి సుభాష్ పాల్గొని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, లక్ష్య సాధన అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు క్రమశిక్షణతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. చదువుతో పాటు మంచి ఆలోచనా విధానం, సమయపాలన, పట్టుదల, సానుకూల దృక్పథాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. మహేందర్, ఉపాధ్యాయులు అరుణ రాణి, నారాయణ రెడ్డి, వేణుగోపాల్, కవిత, సునీత, అశోక్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# చెంచులకు ఇందిరమ్మ ఇండ్లునిర్మించి ఇవ్వాలి




**2వ విడతలో మంజూరు చేయాలి**

**సునారికారి రాజేష్**

**సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి**

**ఖానాపూర్ సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గ కడం మండలంలోని లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో చెంచులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని సిపిఐ (ఎం.ఎల్)న్యూ డెమోక్రసీపార్టీ ఆధ్వర్యంలో కడెంలో ర్యాలీ ధర్నా అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం తాసిల్దార్ కి ఇవ్వడం జరిగింది. ఈ ధర్నా నుద్దేశించి సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ పాల్గొని మాట్లాడుతూ లింగాపూర్ గ్రామంలో గత 70 సంవత్సరాల నుండి చెంచులు గ్రామ శివారులో డేరాలు వేసుకొని జీవిస్తున్నారు. వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ బిక్కు బిక్కుమంటూ బ్రతుకుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు గైడ్లెన్స్ ప్రకారం కడెం మండలంలో మొట్టమొదటి అర్హులు కలిగిన చెంచులు మాత్రమేనని, వారికి కేటాయించి ఇందిరమ్మ ఇల్లు రెండవ విడతలో మంజూరు చేసి, ప్రభుత్వ మే నిర్మించి ఇవ్వాలని, మౌలిక సమస్యలు కల్పించాలని సిపిఐ (ఎం.ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2025లో స్థానిక ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ ని, ఐ టి డి ఎ పిఓ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అప్పుడు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఐటిడిఏ పిఓ స్పందించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ఆనాడు హామీ ఇచ్చారు. ఆ హామీ ప్రకారంగా రెండ వ విడతలో ఎమ్మెల్యే చెంచులకు అందరికీ స్పెషల్ కోటలో పూర్తిస్థాయిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి,నిర్మించి ఇవ్వాలనీ డిమాండ్ చేశారు. కొందరు చెంచులకు స్థలం లేదని రకరకాలుగా అడ్డంకులు సృష్టించి ఇండ్లు రాకుండా అడ్డుకుంటున్నారు వారి పద్ధతులు మార్చుకోవాలని, ప్రస్తుతం నివాసం ఉన్నచోటనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నాం. చెంచులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి నిర్మించి బాధ్యత శాసనసభ్యులు వేడుమ బొజ్జు పటేల్ చొరవ తీసుకోవాలన్నారు. లేనియెడల భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరిస్తున్నాం. ఈ సమావేశం లో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం లింగన్న, భవన నిర్మాణ కమిటీ నాయకులు నల్వాల భూమన్న,పుట్ట గణేష్ గ్రామ అధ్యక్షులు, దండే పూజ గ్రామ కార్యదర్శి, శిరీష, దుర్గవ్వతదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సిద్ధి బుద్ధి సమేత గణపతి కళ్యాణోత్సవం

**నిర్మల్ జిల్లా ప్రతినిధి , సెప్టెంబర్ 19 ,( ప్రజాజ్యోతి ).**నిర్మల్ బ్రాహ్మణ యువజన విభాగం,వి వై ఎ ఎస్ ఎస్ ( వైదిక యజ్ఞ అనుష్టాన సంరక్షణ సమితి), బ్రహ్మపురి ఆధ్వర్యంలో నిర్మల్ బ్రాహ్మణ సంఘ భవనం బ్రహ్మపురి నందు శ్రీ వినాయక నవరాత్రులను పురస్కరించుకొని గణేష సప్తాహం లో భాగంగా చండీ ఉపాసకులు గాడిచర్ల గౌతమ శాస్త్రి, గాడిచర్ల రవిచంద్ర శాస్త్రి గార్ల వైదిక నిర్వహణలో శ్రీ సిద్ధి బుద్ధి సమేత మహా గణపతి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వైదిక కార్యక్రమంలో విగ్రహ దాతలు ఉమాదేవీ సుధీర్ శర్మ దంపతులు హిమకర శర్మ, కిరణ్ శర్మ, దేశ్పాండే సాయి, దేశ్పాండే చైతన్య, ప్రశాంత్ శర్మ, బ్రాహ్మణ సంఘ సభ్యులు, గాయత్రి మహిళా సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

## ఈఎంఐలు చెల్లించలేక.. ఫైనాన్స్ వేధింపులు తట్టుకోలేక పోస్టుమ్యాన్ ఆత్మహత్య



**నేరడిగొండ, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** మండలంలోని సవర్గం గ్రామంలో ఫైనాన్స్ సంస్థల వేధింపులు భరించలేక జాదవ్ అనిల్ (35) అనే యువకుడు పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మృతుడు కొరటికల్ (బి) గ్రామంలో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడి తండ్రి జాదవ్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ ఎలక్ట్రానిక్ ఫైనాన్స్ సంస్థ నుంచి రుణం తీసుకుని ప్రతినెలా రూ.20 వేల చొప్పున ఈఎంఐ చెల్లించేవాడు. అదేవిధంగా మరో ఫైనాన్స్ సంస్థ నుంచి రూ.5 లక్షల రుణం తీసుకుని ప్రతినెలా రూ.15 వేల చొప్పున ఈఎంఐ చెల్లిస్తున్నాడు. అయితే అనిల్ బ్యాంకు ఖాతా ఫ్రీజ్ కావడంతో గత నెల, ఈ నెల ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు ఇంటికి వచ్చి ఈఎంఐ చెల్లించాలంటూ ఒత్తిడి చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ విధులకు వెళ్లే క్రమంలో నేరడిగొండ నుంచి సవర్గం గ్రామానికి వస్తుండగా గ్రామ శివారులో ఫైనాన్స్ ప్రతినిధులు అనిల్‌ను అడ్డుకుని డబ్బులు చెల్లించాలంటూ వేధించినట్లు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వేధింపులతో తీవ్ర మనస్తాపానికి గురైన అనిల్ ఇంటికి వెళ్లి మోనోక్రోటోఫాస్ అనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే గమనించి ప్రైవేట్ ఆటోలో బోథ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అనిల్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి జాదవ్ కిషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు




**మామడ సెప్టెంబర్ 20 (ప్రజా జ్యోతి)** మామడ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో శనివారం పోషణ మాస ఉత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులకు పౌష్టికాహారం, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటిలో ఉండే పోషకాలు, వాటి వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు వంటి పోషకాహారాన్ని నిత్య ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పోషణపై అవగాహన కల్పించే కార్యక్రమాలు, ప్రదర్శనలు నిర్వహించారు. చిన్ననాటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించుకోవడం ద్వారా పోషకాహార లోపాన్ని నివారించవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. పోషణ మాస ఉత్సవాల ప్రధాన లక్ష్యం ప్రతి ఒక్కరిలో ఆరోగ్యం, పోషకాహారం పట్ల అవగాహన పెంపొందించడమేనని తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా జడ్జి రవీందర్, బి డబ్ల్యు డి వినూత్న, సిడిపిఓ నాగలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్ శ్యామల, ఎం ఆర్ ఓ శ్రీనివాస రావు, సఖి మరియు భరోసా కేంద్రాల యొక్క సిబ్బందితోపాటు డి సి పి ఓ మురళి అధికారులు పాల్గొన్నారు.

# త్వరలోనే ఆదిలాబాద్ ఐటీ టవర్ ప్రారంభం

### జిల్లా యువతకు భారీగా ఉపాధి అవకాశాలు 2,000 మంది స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు

### ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 3 ప్రముఖ ఐటీ కంపెనీలు

### నూతన ఐటీ టవర్‌ను పరి శీలించిన డిసిసి అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ జిల్లా కేంద్ర స మీపంలోని బట్టి సావర్గాం గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన ఐటీ టవర్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని, త్వరలోనే దీనిని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా వైభవంగా ప్రారంభించ నున్నట్లు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు (డిసిసి) డాక్టర్ నరేష్ జాదవ్ వెల్ల డించారు. శనివారం జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన బట్టి సావర్గాం వద్ద ఉన్న ఐటీ టవర్ ను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. భవన నిర్మాణం, అంతర్గత సదుపా యాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలు సుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా యువతకు స్థానికంగానే ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవ కాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ ఐటీ టవర్‌ను సకల సౌకర్యాలతో నిర్మించడం జరిగింది. జి+4 (+o4) అంతస్తులలో రూపుదిద్దుకున్న ఈ భవనంలో 2,000 మంది ఐటీ నిపుణులు, యువత పనిచేసుకు నేలా విశాలమైన వసతులు కల్పించాము.""ఈ ప్రాంతంలో ఐటీ విస్తరణకు కంపెనీలు సానుకూలంగా ఉన్నాయి. ఇప్పటికే మూడు ప్రముఖ కంపెనీలు ఇక్కడ తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు, స్థలం కేటాయింపు కో సం దరఖాస్తు చేసుకున్నా యి. మరిన్ని కంపెనీలు ఆదిలాబాద్ వైపు చూస్తున్నాయి. గతంలో ఉపాధి కోసం హైదరాబాద్, బెంగళూరు వంటి మెట్రో నగరాలకు వె ళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు మన ఆదిలా బాద్‌లోనే అవకాశాలు అందుబాటులోకి రావడం శుభ పరిణామం" అని హర్షం వ్యక్తం చేశారు. అతిత్వరలోనే రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమయం తీసుకుని, ప్రారం భోత్సవ తేదీని ఖరారు చే స్తామని తెలిపారు. ప్రారంభోత్సవం అనంతరం స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉద్యోగ అవ కాశాలు వేగవంతం అవుతా యని పేర్కొన్నారు. ఈ కా ర్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రటరీ గంద్రత్ సు జాత, మాజీ డీసీసీ సాజిద్ ఖాన్,మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, టిపిసిసి ఎస్సీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షు లు దుర్గం శేఖర్, జిల్లా ఓబీ సీ విభాగం అధ్యక్షులు అంబకంటి అశోక్, రాష్ట్ర గిరిజన విభాగం ఉపాధ్యక్షులు ఆనందరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఖిజార్ పాషా, ఆదిలాబాద్ రూరల్ మండ లం అధ్యక్షుడు వెంకట్ యాదవ్, గుడిహత్నూర్ మండల అధ్యక్షుడు తొడసం దౌలత్ రావు, కాంగ్రెస్ నాయకులు రుక్మా రెడ్డి,కుంట ప్రవీణ్ రెడ్డి, అంకత్ రవి, దేరా కృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ జనర ల్ సెక్రటరీలు, సెక్రటరీలు ప్ర జాప్రతినిధులు, వివిధ విభాగాలు, అనుబంధ సంఘాల బాధ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిరికొండ తహసీల్దార్ గా అ రవింద్ బాధ్యతల స్వీకరణ



**సిరికొండ, సెప్టెంబర్ 19, (ప్రజా జ్యోతి )**సిరికొండ మండల నూతన తహసీల్దార్‌గా ఆర్ అరవింద్ కుమార్ పదవి బాధ్యతలు స్వీకరించారు. గతంలో సిరికొండ తహసీల్దార్‌గా ఉన్న తుకారాం పదవీ విరమణ పొందారు. గత రెండు నెలుగా తహసీల్దార్ కార్యా లయంలో డిప్యూటీ తహ సీల్దార్‌గా పని చేసిన ఉపేందర్ కు ఇంచార్జి తహసీల్దార్ గా బాధ్యతలు అప్పగించారు. ఇంతకాలం ఇంచార్జి తహసీల్దార్ ఉన్న సిరికొండ మండలంకు నూతన రెగ్యులర్ తహసీల్దార్‌ను నియ మిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేయండంతో మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించిన ఆర్ అరవింద్ కుమార్ ను ప్రభుత్వం సిరికొండ తహసీల్దార్‌గా నియమిస్తూ బదిలీ చేయడంతో శనివారం ఆయన సిరికొండ తహసీల్దార్ కా ర్యాలయం లో నూతన తహ సీల్దార్‌గా బాధ్యత లు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి పుష్ప గుచ్ఛం అందజేసిన శు భాకాం క్షలు తెలిపారు.

## ఆధ్యాత్మిక చెంత న్యాయ అవగాహన సదస్సు

-ఆదివాసీల కు అవగాహన

-అతి దట్టమైన అడవుల్లోకి న్యాయాధికారి



**బోథ్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)** మండలంలోని నిగిని, బాబేర తండా, కైలాస్ టెక్డి గ్రామాలలో శనివారం న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ కైలాస శిఖరంగా పేరొందిన కైలాస్ టేక్డి వద్ద గలశివుడు కొలువై ఒకవైపు చుట్టూ పచ్చని సయాద్రి పర్వతాల గొలుసు కట్టు సొబ గులు మరొకవైపు అంతా అతి దట్టమైన అడవిలో బోథ్ జూనియర్ సివిల్ జడ్జి కే సందీప్ కుమార్ అక్కడి ప్రాంతాల ప్రజలకు హక్కులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రకృతి పర్యావరణాన్ని కాపాడుకుంటూ, తమ మనగడకు అవసరమైన హక్కులు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా చట్టాలను గౌరవిస్తూ నడుచుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆధ్యాత్మికత మార్గంలో ప్రయాణిస్తూ పల్లె గ్రామీణ జనం ప్రతి ఒక్కరూ ఇక్కడి పచ్చని ప్రకృతిని సైతం కాపాడుకోవాలని, అడవి అమ్మ వంటిదని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుంబించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ జి పి పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్ కుమార్, లింబాజీ మహారాజ్, సర్పంచులు, రూప్ చంద్, జాదవ్ పద్మా రవి, మాజీ సర్పంచ్ బద్రు, బందు పటేల్, జైత్రం, గంగయ్య బాబులాల్ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక పాఠశాల ప్రారంభం



**బోథ్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి )** మండలం లోని ధన్నూర్ బి పూర్వ ప్రాథమిక పాఠశాలను శనివారం మండల విద్యాశాఖాధికారి మహ్మద్ హుస్సేన్, సర్పంచ్ రోహిణి వినయ్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి మహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 74 పూర్వ ప్రాథమిక పాఠశాలలు మంజూరి కాగా అందులో ధన్నూర్ బి కి ఒకటి మంజూరైనట్లుగా పేర్కొన్నారు .నాలుగు సంవత్సరాలు నిండిన బాల బాలికలను ఈ పాఠశాలలో చేర్చుకోనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులకు ఒక లక్ష రూపాయల తో ఆట వస్తువులు, పాఠ్యపుస్తకాలు, కుర్చీలు, టేబుల్స్, షూస్,సాక్సులు, ఇతర సామాగ్రి అందజేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా రంగు రంగులతో తరగతి గదిని అలంకరించి, గోడలపై వేయించిన చిత్రాలను చూసి అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోహిణి వినయ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం లక్షల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. ఇట్టి అవకాశాన్ని గ్రామంలోని ప్రతి ఒక్కరు సద్వినియోగ పరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శిల్పాంజలి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, సిబ్బంది రాథోడ్ సవిత, యాల్ల స్వప్న, మాడ ప్రశాంత్ కుమార్, బోనగిరి సారిక, ప్రీ ప్రైమరీ స్కూల్ ఇన్స్ట్రక్టర్ కుంట శకుంతల, ఆయా సగ్గం ఉమారాణి,సుకుమార్ ,సి. ఆర్. పి. రమేష్,వాజిద్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే పిల్లల సంపూర్ణ ఆరోగ్యం



**నేరడిగొండ, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** పోషణ మాసం కార్యక్రమాల్లో భాగంగా గౌళిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులు, పోషణ లోపం ఉన్న పిల్లల తల్లుల మధ్య అనుభవాలను పంచుకునే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచి, ఇంట్లోనే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తయారు చేసి అందించాలని తల్లులకు సూచించారు. చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీల ఇంటిని సందర్శించి, ప్రతిరోజూ తీసుకోవాల్సిన సమతుల్య ఆహారం, ఆరోగ్య పరిరక్షణ పై అవగాహన కల్పించారు. గర్భిణుల ఆరోగ్యం పట్ల భర్తలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జాదవ్ అనుసూయబాయి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

## జూడో క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,( ప్రజా జ్యోతి)** రాయపూర్‌లో ఇటీవల ని ర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ అండర్-18 సెంట్రలైజ్డ్ సెలక్ష న్ ట్రయల్స్‌లో రాణించి, అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్ జూడో క్రీడాకారు లను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అభినందించారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరో వేదికగా డిసెంబర్ 3 నుంచి 8 వరకు జరగనున్న 'ఐఎస్ఎఫ్ జిమ్నాసి యాడ్-2026' టోర్నమెంట్‌కు భారత జట్టుకు ఎంపికైన మోటం హర్షవర్ధన్‌తో పాటు, సెలక్షన్ ట్రయల్స్‌లో మూడో స్థానం సాధించిన రామావత్ తరుణ్‌లను కలెక్టర్ శాలువ, మెమెంటో, ప్రశంసా పత్రం అందజేసి శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలిపారు. అంత ర్జాతీయ వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి దేశం, రాష్ట్రంతో పాటు ఆదిలాబాద్ జిల్లా కీర్తిని ఇనుమడింప జేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్రీ డాకారుల డైట్, శిక్షణా శిబిరాలు, ప్రయాణ ఖర్చుల వివరాలను కలెక్టర్ అడిగి తె లుసుకున్నారు. క్రీడాకారుల కు అవసరమైన మౌలిక వస తులు, సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తామని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో ఏ. దయానంద రెడ్డి, జూడో శిక్షకుడు నంగునూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# వరుస నేరాలకు పాల్పడుతున్న గోపాల్ సింగ్ షెకావత్‌పై పీడీ యాక్ట్

**హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు, దాడులు, వసూళ్లకు పాల్పడినట్లు కేసులు**

**జాతీయ రహదారి ఎన్ ఎచ్ -44పై వాహనదారులు, ట్రాన్స్ పోర్టర్లను భయభ్రాంతులకు గురిచేసిన నిందితుడు**

**ఇప్పటివరకు నిందితునిపై ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 12 కేసులు నమోదు**

**ఇటీవల 2026లో సైతం మూడు కేసుల్లో నిందితుడి గా ఉన్న గోపాల్ సింగ్ షెకావత్**

**ప్రస్తుతం పశువుల అక్రమ రవాణా కేసులో రిమాండ్ నిందితుడు చర్లపల్లి జైలుకు తరలింపుదఇచ్చోడ రూరల్ సీఐ సిహె చ్. రమేష్**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి)** వరుస నేరాలకు పాల్పడు తున్న గోపాల్ సింగ్ షేఖావ త్ పై పోలీసులు పిడి యాక్ట్ నమోదు చేశారు. హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు, దాడులు, వసూ ళ్లకు పాల్పడినట్లు కేసులు నమోదు చేశారు. ఇచ్చోడ రూరల్ సీఐ సిహె చ్. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం, ఆదిలా బాద్ పట్టణంలోని తాటిగూడకు చెందిన గోపాల్ సింగ్ షెకావత్ (32), ప్ర జా శాంతిభద్రతలకు విఘా తం కలిగించే విధంగా వరు సగా నేరాలకు పాల్పడుతు న్న నేపథ్యంలో తెలంగాణ ప్రమాదకర కా ర్యకలాపాల నిరోధక చ ట్టం--1986 (పీడీ యాక్ట్) కింద చర్యలు చేపడుతూ నిందితున్ని చర్లపల్లి జైలుకు తరలించడం జరిగిందని తెలిపారు. గతంలో హత్య, హత్యాయత్నం, మోసం, బెదిరింపులు, దాడులు, వసూళ్లకు సంబంధించిన పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న అతని పై 2022 లో ఆదిలాబాద్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ కూడా తెరిచారు. నిందితుని పై జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 12 కేసులు నమోదు కాగా, 2026లో ఇటీవల నేరడి గొండ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 259 /2026, గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 254/ 2026, ఇచ్చోడ పోలీస్ స్టేషన్ లో క్రైమ్ నంబర్ 446/ 2026 కేసుల్లో గోపాల్ సింగ్ షెకావత్ నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసుల్లో హత్యాయత్నం, మోసం, వసూళ్లు, ప్రజలపై దాడులు, బెదిరిం పులకు సంబంధించిన నే రా రోపణలు ఉన్నాయి. జాతీయ రహదారి ఎన్ ఎచ్ -44 పై వాహనదారులు, ట్రాన్స్



పోర్టర్లను వేధిస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వి ధంగా వ్యవహరించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్ల డైంది. ప్రస్తుతం నేరడిగొండ పోలీస్ స్టేషన్ లో పశువుల అక్రమ రవాణా కేసులో నిం దితుడుగా ఉంటూ రిమాండ్ ఖైదీగా ఉండడం జరిగిందని తెలిపారు ఇటీవల జరిగిన ఈ నేరాలు ప్రజాశాం తిభద్రతలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నందున, భవిష్యత్తులో ఇలాంటి కార్యకలాపాల కు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిం చేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ సిఫార్సు మేరకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఐఎఎస్ పీడీ యాక్ట్ కిం ద నిర్బంధ చర్యలు చేపట్టి నట్లు ఇచ్చోడ రూరల్ సీఐ సిహెచ్. రమేష్ తెలిపారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేర కార్యకలాపా లకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని ఆయన స్పష్టం చేశారు.

## రాణి సతీజీ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్







**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు నిర్వహించిన ఆర్ జి పి ఆర్ ఎస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా వచ్చిన ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తో కలిసి ఆదిలాబాద్ జి ల్లా కేంద్రంలోని రాణి సతీజీ కాలనీలోని రాణి సతీజీ మందిరంలో ప్రతిష్టించిన వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. రాణి సతీజీ ఆల య కమిటీ సభ్యుల ఆహ్వా నం మేరకు 18-09-2026 న ఈ పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కమిటీ సభ్యులు ఏ ఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ ని, డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచిన్ సావంత్ మాట్లాడుతూ, ఆది లాబాద్ జిల్లా కేంద్రంలో ఎ న్నో సంవత్సరాలుగా వినా యకుడిని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీ యమన్నారు. గణేష్ ఉత్స వాలను భక్తి, శ్రద్ధలతో నిర్వ హిస్తున్న రాణి సతీజీ మండల్ కమిటీ సభ్యులను ఆ యన అభినందించారు. డీ సీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, రాణి సతీజీ కాలనీలో ప్రతి సంవత్సరం ప్రతిష్టించే వినాయ కుడు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక ఆకర్షణగా ని లుస్తున్నారని అన్నారు. ఎ న్నో సంవత్సరాలుగా కొన సాగుతున్న ఈ సంప్రదా యం ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొంది స్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు సాజీద్ ఖాన్, పీసీసీ మాజీ జనరల్ సెక్ర టరీ గంద్రత్ సుజాత, టీపీ సీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉ పాధ్యక్షులు దుర్గం శేఖర్, డీసీసీ జనరల్ సెక్రటరీ గౌలి సంజీవ్, టీటీడీ మాజీ బోర్డు మెంబర్ ఉ డీసీసీ ఆఫీస్ ఇం చార్జి బెజ్జంకి అనిల్ కుమా ర్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తొడసం దౌలత్ రావు, కాంగ్రె స్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు, కమిటీ సభ్యులు, ప్రజ లు, భక్తులు తదితరులు పా ల్గొన్నారు.

# ఉచిత శిక్షణ ఎంపిక కోసం అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలి

**ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వర్**

**ఉట్నూర్, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర గిరిజనసంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ- ఉట్నూర్ ద్వారా యుపి ఎస్ సి సివిల్ సర్వీసెస్ పరీక్ష--2027కు సంబంధించి అర్హులైన ఎస్.సి., ఎస్.టి. బి. సి. అభ్యర్థుల ఎంపిక కోసం అర్హత పరీక్షకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభి వృద్ధి సంస్థ ఇంచార్జ్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వర్ ఒక ప్రక టనలో తెలిపారు. యుపి ఎస్ సి సివిల్ సర్వీసెస్ పరీక్ష--2027లో ప్రిలిమ్స్, మెయిన్స్, పర్సనాలిటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఎం పికైన అభ్యర్థులకు శ్రీరామ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రైవే ట్ లిమిటెడ్ సహకారంతో ఉచిత శిక్షణ, గైడెన్స్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 8 నెలల పాటు / యు పి ఎస్ సి సివిల్ సర్వీసెస్ ప్రి లిమినరీ పరీక్ష--2027 తేదీ వరకు (ఏది ముందైతే అప్పటి వరకు) హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్, మానసా హిల్స్‌లో ఉన్న ఐ ఎ ఎస్ స్టడీ సర్కిల్ (ఎస్.సి.)లో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 23వ తేదీ లోగా అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని,25 వ తేదీ మధ్యాహ్నం 2 గంట ల నుండి హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకోవచ్చని, 27వ తే దీన ఉద యం 9:30 గంటల నుంచి 11:30 గంటల వర కు, మధ్యాహ్నం 2:30 నుం చి 4:30 గంటల వరకు స్క్రీ నింగ్ టెస్ట్ ఉంటుందని తెలి పారు. అక్టోబర్ 1వ తేదీన ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూ ఉంటాయని, 2వ తేదీన ఎంపికైన అభ్యర్థుల తుది ఫలితాలు, 5వ తేదీ నుండి తరగతులు ప్రారంభ మవుతాయని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు తెలిసే విధంగా ఈ అవకా శం పై విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. గ్రామపంచాయతీలు, గ్రామ సంస్థలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, సంబంధిత శాఖల ద్వారా సమా చారాన్ని విస్తృతంగా చేరవే సి, గిరిజన, గ్రామీణ ప్రాంతాలలోని అర్హులైన ఎ స్.సి., ఎస్.టి., బి.సి. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# విద్యా పాఠశాల ఉపాధ్యాయుడికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు




**సారంగాపూర్: సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి** మండలంలోని విద్యా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు తలేవార్ సాయినాథ్కు తెలంగాణ పాఠశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్, నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్ మాట్లాడుతూ.. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న తలేవార్ సాయినాథ్‌ను అభినందించారు. ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి ఇలాంటి అవార్డులు అందించడం ద్వారా వారిలో మరింత ఉత్సాహం, శిక్షణ నైపుణ్యం పెంపొందుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. నవీన్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, శ్రీలత, పల్లవి, సుమన్య, లావణ్య, సంధ్యారాణి, స్రవంతి, సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, లావణ్య, జ్యోతి, కీర్తనతో పాటు విద్యార్థులు సాయినాథ్‌ను అభినందించారు. ఉపాధ్యాయుల ప్రతిభకు గుర్తింపు.. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రోత్సాహంఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి సత్కరించడం విద్యారంగంలో మరింత స్ఫూర్తిని నింపుతుందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

# ఎంపీ, ఎమ్మెల్యే రాజకీయ ప్రచారానికి పరిమితం కా కుండా అభివృద్ధిపై దృష్టి సారించాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి)** ఎంపీ ఎమ్మెల్యే రాజకీయ ప్రచారానికే పరిమితం కా కుండా అభివృద్ధిపై దృష్టి సా రించాలని మాజీ మంత్రి, బి ఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షు డు జోగు రామన్న డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు రోజు రోజుకు విభిన్న తరహా లో వ్యవహరిస్తూ, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల ను మోసం చేయగలిగామ ని, ఇక రాజకీయ ప్రయో జ నాల కోసం దేవుడిని కూడా రాజకీయాలకు ఉపయో గిం చుకునే స్థాయికి వారివ్యవ హార శైలి చేరిందనీ మాజీ మంత్రి జోగు రామన్నఅన్నా రు. శనివారం జిల్లా బీఆర్ ఎస్ పార్టీ కార్యాలయం లో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ల వ్యవహార శైలిపై జోగు రా మన్న విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడు తూ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే లు రాజకీయ ప్రయోజనాల కోసం ఆలోచించడం మాను కుని ఆదిలాబాద్ అభివృద్ధి పై దృష్టి సారించాలని డి మాండ్ చేశారు. ఆదిలాబా ద్ లో అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లకుండా కేవలం కమిషన్లకు సంబం ధించిన పనులకే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలను ఆయన చేశారు. రైల్వే పనులపై సమాధానం చెప్పాల ని, ఆదిలాబాద్--ఆర్మూర్ రైల్వే లైన్‌తో పాటు జైనథ్, బేల ప్రాంతాల ప్రజలు ఎదు రుచూస్తున్న రైల్వే పనులపై స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జోగు రామ న్న ప్రశ్నించారు. ఆదిలాబా ద్ కు రావాల్సిన రైల్వే పిట్ లైన్ పనులు మహారాష్ట్రకు తరలిపోవడం స్థానిక ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యానికి నిద ర్శనమన్నారు. ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌ను అమృత్ 2.0 పథకం కింద అభివృద్ధి చేస్తా రని ప్రజలు ఆశించారని, అ యితే ఇప్పటికీ పనులు ముందుకు సాగకపోవడంపై ఎంపీ, ఎమ్మెల్యేలు సమాధా నం చెప్పాలని డిమాండ్ చే శారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమైతే ప్ర యాణికులకు మెరుగైన సౌ కర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. గతంలో స్థానిక ఎంపీ నగేష్ ఆది లాబాద్--ఆర్మూర్ రైల్వే లైన్ మంజూరులో బీఆర్ఎస్ పా ర్టీ వాటా లేదని మీడియా స మావేశంలో పేర్కొన్న విష యాన్ని జోగు రామన్న గుర్తు చేశారు. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, స్థానికం గా బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నప్పటికీ పనులు ఎందు కు నిలిచిపోయాయని ప్ర శ్నించారు. కేంద్రంలో డబల్ ఇంజన్ సర్కార్ ఉన్న , అది లాబాదులో బిజెపి ఎంపీ ఎ మ్మెల్యే ఉన్నప్పటికీ పనుల కు ఎవరు అడ్డుగా ఉన్నారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా మోసపూరిత మాటలను ప క్కనపెట్టి ఆదిలాబాద్ అభి వృద్ధికి కృషి చేయాలని జోగు రామన్న సూచించారు. ప్రజా సమస్యలపై బీ ఆర్ ఎ స్ పార్టీ కేంద్ర ప్రభుత్వ వైఖ రిని ప్రశ్నిస్తూనే ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు అజయ్ చందాల, రాజన్న, సేవ్వా జ గదీష్, దమ్మపాల్, కొండ గ జేష్, పండ్ల శ్రీనివాస్, బొట్టు రమేష్, మహేష్, గణేష్ యాదవ్ తదితరులు పాల్గొ న్నారు.

# దివంగత నేత మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి కి ఏఐసిసి సెక్రెటరీ సచిన్ సావంత్ ఘన నివాళి



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి)** దివంగత నేత, మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రా రెడ్డి నివాసానికి ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘణంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సచిన్ సావంత్ మాట్లాడుతూ ఆదిలాబాద్ ముద్దుబిడ్డగా ప్రజల హృదయాల్లో నిలిచిన చిలుకూరి రామచంద్రారెడ్డి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పట్ల, ఆదిలాబాద్ జిల్లా ప్రజల పట్ల ఆయనకు ఎంతో ప్రేమ, అంకితభావం ఉండేదని తెలిపారు. పార్టీ బలోపే తానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. రామచంద్రారెడ్డి ప్రజా జీవితంలో అందించిన సేవలు, పార్టీ కోసం చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సచిన్ సావంత్ అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి గంగ్రేత్ సు జాత, మాజీ డిసిసి అధ్య క్షులు సాజిద్ ఖాన్,మార్కెట్ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ అనూష సతీష్, మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి,చిలుకూరి రామచంద్రా రెడ్డి సోదరులు చిలుకూరి లక్ష్మా రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకూరి రామచంద్రా రెడ్డి మేన ల్లుడు సంజీవ్ రెడ్డి, జిల్లా ఓబీసీ అధ్యక్షులు అంబకంటి అశోక్, టిపిసిసి ఎస్సి డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ దుర్గం శేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దే రాక్సస్థారెడ్డి, డిసిసి ఉపా ధ్యక్షుడు సుధా కర్ గౌడ్, జిల్లా కోశాధికారి హిమాభిషేక్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు అన్నపూర్ణ, రూరల్ మండలం అధ్యక్షుడు వెంకట యాదవ్, కాంగ్రె స్ పార్టీ సీనియర్ నాయకులు రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి వేడుకల్లో నయా ట్రెండ్



**సోనాల, సెప్టెంబర్ 19 ( ప్రజాజ్యోతి) :**సోనాల మండల కేంద్రంలో ఈరోజు తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వివేకానంద గణేష్ మండలి వద్ద ఇరుముడి సినిమా ఎల్ఈడి స్క్రీన్ పై ప్రదర్శన జరిగింది. ఈ ఏడాది గణేష్ నవరాత్రి వేడుకలు సరికొత్త సాంకేతిక సొబగులతో అలరిస్తున్నాయి. కేవలం భారీ విగ్రహాలు, ఆకర్షణీయమైన మండపాలే కాకుండా, భక్తులను విశేషంగా ఆకట్టుకునేందుకు నిర్వాహకులు కొత్త దారి ఎంచుకున్నారు. "కాలక్షేపంగా కాకుండా భక్తిభావాన్ని, సాంప్రదాయ విలువలను పెంచేలా ఈ ప్రదర్శనలు ఉండటం అభినందనీయం" అని భక్తులు కొనియాడుతున్నారు.

# 54 అడుగుల భారీ వినాయ కుడికి ప్రత్యేక పూజలు

## పాల్గొన్న ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 19: (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ (ఆర్ జి పి ఆర్ ఎస్) ఆధ్వర్యంలో ని ర్వహించిన శిక్షణ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, ఆదిలాబా ద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీ సీసీ) అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ తో కలిసి జిల్లా కేం ద్రంలోని కుమార్‌పేట్ కాలనీ లో ప్రతిష్టించిన54 అడుగుల భారీ వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుమార్ జనతా మండల్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సచిన్ సావంత్, డా. నరేష్ జాదవ్ గణ నాథుడికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం కమిటీ సభ్యులు వారిని శాలువాలతో సత్క రించారు. ఈ సందర్భంగా సచిన్ సావంత్ మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అనేక సంవత్సరాలుగా సంప్రదాయబద్ధంగా 54 అడుగుల భారీ వినాయ కుడిని ప్రతిష్టించడం అభి నందనీయమన్నారు. భక్తిశ్ర ద్ధలతో గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తున్న కుమార్ జన తా మండల్ కమిటీ సభ్యులను ఆయన అభినందిం చారు. డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ, కుమార్‌పేట్ కాలనీలో ప్రతి సంవత్సరం ప్రతిష్టించే భారీ వినాయకుడు ఆదిలాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారని అన్నారు. ఎన్నో సంవత్సరా లుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయం ప్రజల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంపొందించేందుకు దోహ దపడుతోంద ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీ సీసీ అధ్యక్షులు సాజిద్ ఖా న్, పీసీసీ మాజీ జనరల్ సె క్రటరీ గంద్రత్ సుజాత, టీ పీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులు దుర్గం శేఖర్, డీసీసీ జనరల్ సెక్రటరీ గౌలి సంజీవ్, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు, డీసీసీ ఆఫీస్ ఇంచార్జి బెజ్జంకి అనిల్ కు మార్, గుడిహత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోడసం దౌలత్ రావు, జిల్లా మీడియా అండ్ క మ్యూనికేషన్ కోఆర్డినేటర్ మేకల జితేందర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుమార్ జనతా మండల్ కమిటీ సభ్యులు, ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బాల్యం నుంచే మంచి అలవాట్లు అలవర్చు కోవాలి






జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**తలమడుగు, సెప్టెంబర్ 19,(ప్రజా జ్యోతి)** బాల్యం నుంచే విద్యార్థులు మంచి అలవాట్లు, క్రమశిక్షణ, సత్ప్రవర్తనను అలవ ర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, నై తిక విలువలు, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తుకు బాట లు పడతాయని అన్నారు. తలమడుగు మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన 'ఆరో గ్య పాఠశాల--ఆరోగ్య జాతర', మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ పోషణ్ మాసం కార్యక్రమాలను కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్ర జ్వలన చేసి ప్రారంభించా రు. ముందుగా పోషణ్ మా సం సందర్భంగా ఏర్పాటు చే సిన వివిధ ఫుడ్ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించారు. పౌష్టి కాహారం, సమతుల ఆహా రం ప్రాధాన్యాన్ని తెలుసుకు న్నారు. అనంతరం పీఎం శ్రీ పాఠశాలలోని సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగారు. పాఠ శాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ గదిని ప్రారంభించి, విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటిం చారు. ఈ సందర్భంగా నిర్వ హించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులలో ఆ రోగ్యకర మైన అలవాట్లు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడమే ఆరో ్య పాఠశాల, ఆరోగ్య జాతర కార్యక్రమాల ప్రధాన ఉద్దే శమన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుం డా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం పర్యవే క్షిస్తూ మార్గనిర్దేశం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు దెబ్బ తింటుందని, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదా ర్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని హితవు పలికారు. గంజాయి సాగు, విక్రయం లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీలో అధిక సంఖ్య లో సీట్లు సాధించేలా ఉపా ధ్యాయులు, తల్లిదం డ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యా ర్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తిం చి, వారికి సరైన మార్గదర్శ కత్వం అందించాలని అన్నా రు. కంప్యూటర్ విద్య, సాం కేతిక పరిజ్ఞానాన్ని అందిపు చ్చుకుని పోటీ ప్రపంచంలో ముందుకు సాగాలని విద్యా ర్థులకు సూచించారు. పోష ణ్ మాసం సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టి కాహారం, ప్రాథమిక విద్యా బోధనతో పాటు గర్భిణులు, బాలింతలకు అవసరమైన సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రజలు అంగన్ వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు జిల్లాలో ఖాళీగా ఉన్న అంగ న్‌వాడీ కేంద్రాల పోస్టులను త్వరలోనే భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపా రు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళా కారులు, విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, పరిశుభ్రత, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై ప్రదర్శించి న నాటికలు, పాటలు, ఉప న్యాసాలు విశేషంగా ఆకట్టు కున్నాయి. పోషణ్ మాసం ద్వారా లబ్ధి పొందిన మహిళలు తమ అనుభవాలను, అభిప్రాయాలను వేదికపై పంచుకున్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంఈవో, పాఠశాల ప్రధానోపాధ్యా యులు వెంకట్ రావు, సర్పంచ్ రాజన్న, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ సాయి కిరణ్, లీగల్ ఎయిడ్ కౌన్సి లర్లు, సీడీపీవోలు సురేఖ, సౌందర్య, అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## వింధ్యా పాఠశాల లో భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



**సారంగాపూర్, సెప్టెంబర్ 19,ప్రజా జ్యోతి** మండలంలోని వింధ్యా పాఠశాలలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణనాథుడికి వీడ్కోలు పలికారు. భక్తి గీతాలు, సందడి మధ్య నిమజ్జన కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్, ప్రధానోపాధ్యాయులు కే. నవీన్ కుమార్, ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, శ్రీలత, పల్లవి, సుమన్య, లావణ్య, సంధ్యారాణి, స్రవంతి, సులోచన, గౌతమి, దివ్య, సౌజన్య, పావని, ప్రేరణ, శరణ్య, లావణ్య, జ్యోతి, కీర్తనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

**భక్తి పాటలతో సందడి**

వినాయకుడి నిమజ్జన సందర్భంగా విద్యార్థులు భక్తి గీతాలు ఆలపిస్తూ, ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో కార్యక్రమాన్ని నిర్వహించడంపై పాఠశాల యాజమాన్యం అభినందించింది

## వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు




**ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 19,( ప్రజా జ్యోతి )** అదిలాబాద్ పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు గణేష్ మండళ్ల నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా స తీష్, జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్, హిందూ ఉత్సవ స మితి అధ్యక్షులు లచ్చన్న, డీఎస్పీజీవన్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా స తీష్ మాట్లాడుతూ నిమజ్జ న మార్గాల్లో గుంతలను పూ డ్చడంతో పాటు చాందావాగు, పెంగంగా నదీ పరివాహక ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో మున్సిపల్ సిబ్బందిని అం దుబాటులో ఉంచి, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నిమజ్జన చివరి రోజు జరిగే అన్నదాన కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని శానిటేషన్‌పై ప్ర త్యేక దృష్టి సారిస్తున్నామ ని, పట్టణంలో ప్రత్యేక పారి శుధ్య డ్రైవ్ నిర్వహిస్తూ అ దనపు సిబ్బందిని కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. "వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరిగి అదిలాబాద్ పట్టణానికి మంచి పేరు వచ్చేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, అ ధికారులు, పోలీసులు, ము న్సిపల్ సిబ్బంది, గణేష్ మండళ్ల నిర్వాహకులు స మన్వయంతో పనిచేస్తూ ని మజ్జన కార్యక్రమాన్ని విజ యవంతం చేద్దాం" అని ము న్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ అన్నారు.